జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 23, ఫిబ్రవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


# గ్రూప్-2 మెయిన్స్ యథాతథం

- 23వ తేదీన జరిగే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష యథాతథంగా జరుగుతుందన్న ఏపీపీఎస్సీ
- సోషల్ మీడియాలో జరిగే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచన

**విజయవాడ,మహానాడు:** విజయవాడ ఆదివారం (23 ఫిబ్రవరి) గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష యథాతథంగా జరుగుతుందని ఏపీపీఎస్సీ ప్రకటించింది. ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుందని వెల్లడించింది. అభ్యర్థులు 15 నిమిషాలు ముందే పరీక్షా కేంద్రానికి రావాలని సూచించింది. గ్రూప్-2 మెయిన్స్ వాయిదా అంటూ జరుగుతోన్న ప్రచారాన్ని ఖండించింది.

**గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు:** సోషల్ మీడియాలో జరిగే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని ఏపీపీఎస్సీ సూచించింది. తప్పుడు ప్రచారం చేసేవారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మరోవైపు ఇప్పటికే ఏపీపీఎస్సీ గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. గ్రూప్-2 పరీక్షలకు 92 వేల 250 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. సెన్సిటివ్ పరీక్షా కేంద్రాలుగా గుర్తించిన మిగతా.. 2లో

'పబ్లిక్' ఝలక్

# 'ఎమ్మెల్సీ'లకు ఏపీపీఎస్సీ అగ్ని 'పరీక్ష'

- పరీక్షలు వాయిదా వేయాలంటూ అభ్యర్థుల వినతి
- అభ్యర్థుల వినతికి సర్కారు సానుకూల స్పందన
- పరీక్షలు వాయిదా వేయమన్నా పట్టించుకోని ఏపీపీఎస్సీ
- సర్కారుకు ఏపీపీఎస్సీ బాసుల ఝలక్
- సీఎం చంద్రబాబు లేఖనూ లెక్కచేయని ధిక్కారం
- వాయిదా కుదరదంటూ తిరుగుటపాలో లేఖ రాసిన ఏపీపీఎస్సీ
- లోకేష్ ట్వీట్‌నూ పట్టించుకోని అధికారులు
- అనుకున్న ప్రకారమే నేడు ఏపీపీఎస్సీ పరీక్ష
- అనూరాధను ఏరికోరి నియమించుకున్న చంద్రబాబు
- ఎవరికీ అందుబాటులోకి రాని అనూరాధ
- పరీక్ష వాయిదా లేదంటూ ఇన్చార్జి సెక్రటరీ పత్రికా ప్రకటన
- పైగా దుష్ప్రచారం చేస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు
- పాలకుల పరువు తీసిన ఏపీపీఎస్సీ ఇన్చార్జి సెక్రటరీ
- నష్టపోతున్న వేలాదిమంది నిరుద్యోగ అభ్యర్థులు
- వైజాగ్‌లో రాత్రివేళ రోడ్డెక్కిన అభ్యర్థులు
- విజయవాడలో ఏపీపీఎస్సీ ఆఫీసు ముట్టడికి యత్నం
- నిరుద్యోగ అభ్యర్థుల ఆగ్రహంతో కూటమి అభ్యర్థులలో వణుకు
- ఏపీపీఎస్సీ నిర్ణయంతో ప్రమాదంలో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు
- నిరుద్యోగులు పీడీఎఫ్ వైపు మొగ్గే ప్రమాదం?
- ఇప్పటికే రెండుచోట్లా కూటమి-పీడీఎఫ్ అభ్యర్థుల ఓట్ల తేడా 20 వేలే
- ఏపీపీఎస్సీ మొండి వైఖరితో ప్రమాదంలో కూటమి అభ్యర్థుల భవితవ్యం
- ఓటమి ఖరరాయిందంటూ ఇప్పటికే తల పట్టుకుంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- సర్కారుకు ఏపీపీఎస్సీ అధికారుల అవమానం



"పిల్లి గుడ్డిదయితే ఎలుక ఏదో చూపించిందన్నది వెనుకటికి ఒక ముతక సామెత. ఇప్పుడు ఏపీలో సరిగ్గా జరుగుతోంది అదే. ప్రభుత్వ ఆదేశాలను అమలుచేయాల్సిన అధికారులు, చివరకు సీఎం మాటను కూడా బేఖాతరు చేసి , అవమానపర్వానికి తెరలేపిన ధిక్కార పర్వమిది. ఏరికోరి మరీ నియమించుకున్న అధికారులే.. సర్కారు సూచనలను బుట్టదాఖలు చేస్తే, మరి ప్రభుత్వాన్ని నడుపుతున్నది ఎవరు? అధికారులా? రాజకీయ నాయకత్వమా? ఇక ప్రభుత్వం నడపటం కూటమికి అవసరమా?.. ఇవీ.. ఏపీపీఎస్సీ బాసుల పుణ్యాన.. వేలాదిమంది నిరుద్యోగ అభ్యర్థుల దృష్టిలో ముద్దాయిగా నిలబడ్డ, 'కూటమి సర్కారు విషాదంపై' కూటమిలో వినిపిస్తున్న వ్యాఖ్యలు!

కుక్క తోకను ఆడించాలి. కానీ తోక కుక్కను ఆడించకూడదు. ఏపీలో జరుగుతున్న విచిత్ర-విషాద-విభ్రాంతికరమైన వ్యవహారాలు చూస్తే.. మెదడున్న ఎవరికయినా ఇలాంటి సందేహమే వస్తుంది. ప్రభుత్వంలో ఉన్నవారికి తెలియకుండానే విపక్ష పార్టీ కాంట్రాక్టర్లకు బిల్లులు పువ్వుల్లో పెట్టి ఇస్తుంటారట. మంత్రులకు తెలియకుండానే విపక్ష పార్టీకి సేవలందించిన అధికారులు బదిలీ అవుతుంటారట. కార్పొరేషన్ చైర్మన్లను అధికారులు ఖాతరు చేయరు. విపక్ష పాలనలో వెలిగిన కంపెనీలకే మళ్లీ కాంట్రాక్టులు, బిల్లులు ఇచ్చేస్తుంటారట. ఆ కంపెనీలకు మేళ్లు చేసిన అధికారులకే పిలిచి పెద్దపీట వేసి, పాలన అప్పగిస్తారు. మరి ఆ ప్రకారంగా ఇప్పుడు జరుగుతున్నది రాజకీయ పాలనా? అధికారుల పాలనా? పెత్తనం చేస్తున్నది ప్రభుత్వమా? ప్రభుత్వం నియమించిన అధికారులా?.. ఏపీపీఎస్సీ చేతిలో దారుణ పరాభవం పాలైన సర్కారు దీన స్థితిని చూసిన వారికెవరికయినా కలిగే సందేహాలే ఇవి."





(మార్తి సుబ్రహ్మణ్యం)

కామెంట్



ఆదివారం ఏపీపీఎస్సీ పరీక్ష జరగనుంది. అయితే దానిని వాయిదా వేయాలని అభ్యర్థులు చాలారోజుల నుంచి డిమాండ్ చేస్తున్నారు. రోస్టర్ తప్పులు సరిచేయకుండా పరీక్ష నిర్వహించడంపై అభ్యర్థులు అభ్యంతరం, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దానిపై కోర్టులో పిటిషన్ కూడా వేశారు. ఇది ఈనెల 11న విచారణకు రానుంది. ప్రభుత్వం తరఫున అఫిడవిట్ వేసేందుకు ఇంకా సమయం కావలసి ఉంది.

దీనితో పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న 92,750 మంది అభ్యర్థుల భవిష్యత్తు, ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పరీక్ష వాయిదా వేయమని ఏపీపీఎస్సీకి లేఖ రాశారు. తాజాగా పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులతో చంద్రబాబు నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కూడా పరీక్ష వాయిదా చర్చ జరిగింది. అభ్యర్థుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని పరీక్ష వాయిదా వేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు సూచించారు. దానితో చంద్రబాబు స్పందించి, పరీక్ష వాయిదాకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. అంతకుముందు విద్యాశాఖ మంత్రి లోకేష్ కూడా విద్యార్థుల భవిష్యత్తు, ఆందోళనను లీగల్ దృష్టికి వెళ్లి పరిష్కరిస్తానని ట్వీట్ చేశారు.

కాగా శుక్రవారం పరీక్ష వాయిదా వేయమని సీఎం చంద్రబాబు ఏపీపీఎస్సీకి లేఖ రాశారు. అయితే ఇప్పుడు వాయిదా వేయడం కుదరదని ఇన్చార్జి కార్యదర్శి నర్సింహమూర్తి తిరుగులేఖ రాయడం సర్కారుకు తలకొట్టేసినంత పనయింది. మరో అడుగుముందుకేసిన ఇన్చార్జి కార్యదర్శి.. పరీక్షలు వాయిదా వేయలేదని, ముందుగా నిర్ణయించిన ప్రకారం ఆదివారం పరీక్షలు యథావిధిగా జరుగుతాయని, వాయిదా అంటూ జరుగుతున్న దుష్ప్రచారం నమ్మవద్దని పత్రికాప్రకటన విడుదల చేశారు. అక్కడితో ఆగని ఆయన..పరీక్ష వాయిదాపై దుష్ప్రచారం చేస్తున్న చానెళ్లు, సోషల్‌మీడియా పోస్టులపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టించింది. ఇది ప్రభుత్వాన్ని నేరుగా ధిక్కరించడమేనని అధికారి తీరుతో స్పష్టమయింది. ఒకరకంగా వేలాదిమంది విద్యార్థుల ఎదుట, ప్రభుత్వాన్ని ముద్దాయిగా నిలబెట్టడమేనన్న వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

నిజానికి మాజీ ఐపిఎస్ అధికారిణి అనూరాధ రిటైరయిన ప్పటికీ, ఆమెను ఏరికోరి ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమించారు. ముక్కు సూటి అధికారిగా పేరున్న ఆమె, ప్రభుత్వంలో ఉన్న వారి మాట వినరన్న ప్రచారం తెలిసిందే. నిబంధనల ప్రకారం వ్యవహరించే అనూరాధకు, గతంలో చంద్రబాబునాయుడు ఇంటలిజన్స్ చీఫ్ పోస్టింగ్ ఇచ్చారు. ఆమె హయాంలోనే ఓటుకునోటు కేసు ఘటన జరిగింది. రేవంత్‌రెడ్డిని అరెస్టు చేయడంతోపాటు, హైదరాబాద్‌లో పరిణామాలు ముందుగా కనిపెట్టడంలో విఫలమైన ఆమెను తప్పించి, ఏబీ వెంకటేశ్వరరావును ఆ పదవిలో ఆగమేఘాలపై నియమించారు.

మళ్లీ ఆమె రిటైరనప్పటికీ, పిలిచి ఏపీపీఎస్సీ చైర్మన్ వంటి కీలక బాధ్యత అప్పగించడం పార్టీ వర్గాలను విస్మయపరిచింది. విపక్షంలో ఉండగా పార్టీకి వివిధ రూపాల్లో సేవలందించిన అనేక మంది అధికారులు ఉండగా, ఎవరికీ ఎలాంటి మేలు చేయని అనూరాధకు చైర్మన్ ఇవ్వడమే వారి ఆశ్చర్యానికి కారణం. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మొదటి పోస్టింగ్ పార్టీ నాయకులకు ఇస్తారని భావించారు. కానీ పార్టీకి ఎలాంటి సేవలు చేయని మాజీ ఐఏఎస్ లక్ష్మీపార్థసారథికి తొలి పోస్టింగ్ ఇవ్వడం పార్టీ వర్గాలను విస్మయపరిచింది.

నిజానికి ఎవరికీ ఎలాంటి మేలు చేయని అధికారులను, చంద్ర బాబు ఏరికోరి పదవులిచ్చారన్న విమర్శలు ఇప్పటికీ వినిపిస్తున్నాయి. పార్టీకి పనిచేసే వర్గాలకు మేలు చేయని వారికి చైర్మన్ పదవులివ్వడం వల్ల ఎవరికి ఉపయోగం? కార్యకర్తలకు పనులు చేయకపోతే వారిని అక్కడ ఎందుకు నియమించారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అసలు అధికారులకు రాజకీయ పదవులు ఇవ్వడం ఏమిటి? అన్న ప్రశ్నలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మిగతా.. 2లో



03

అయోమయంలో గ్రూప్-2



09

చెల్లని సీఎంఆర్ఎఫ్ చెక్కు



03

బాబుకు రేవంత్ రెడ్డి గోదావరి జలాల గురుదక్షిణ




02

ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద కుప్పకూలిన పైకప్పు



08

పోలీస్ శాఖ అవసరాలు తీరుస్తాం



## సీఎం చంద్రబాబు సీపీఆర్వో ఆలూరి రమేష్

**విజయవాడ,మహానాడు:** సిఎం చంద్రబాబు నాయుడు తన వద్ద 4 ఏళ్లుగా పిఆర్ఓగా పనిచేస్తున్న జర్నలిస్టు ఆలూరి రమేష్‌ను చీఫ్ పిఆర్ఓగా ఖరారు చేశారు. రమేష్ ప్రస్తుతం మిగతా.. 2లో

# అన్నీ రేవంత్ చూస్తాడనుకోవద్దు

- రాహుల్‌కు ఇచ్చిన మాట ప్రకారం నా బాధ్యత పూర్తి చేశా
- ఇక జనంలోకి వెళ్లి చెప్పాల్సిన బాధ్యత మీదే
- కులసంఘాలతో మీటింగులు పెట్టండి
- కులగణన ఘనత గురించి చెప్పండి
- ఈ అవకాశాన్ని జారవిడుచుకుంటే చరిత్ర మిమ్మల్ని క్షమించదు.
- కేసీఆర్ సర్వే ప్రకారం బీసీలు 51 శాతం మాత్రమే
- కానీ మన కులగణన ప్రకారం 56.33 శాతం
- ఇక బీసీల లెక్క తగ్గిందో పెరిగిందో మీరే చెప్పండి
- ప్రజాభవన్‌లో బీసీ నేతల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మహానాడు:** కులగణన ఎక్స్‌రే లాంటిదని రాహుల్ గాంధీ గారు ఆనాడే చెప్పారు. అన్ని రంగాల్లో బీసీలకు సామాజిక న్యాయం జరగాలంటే కులగణన చేయాల్సిందేనని రాహుల్ గాంధీ గారు స్పష్టం చేశారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే కులగణన చేసి తీరుతామని రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో మాట ఇచ్చారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే తప్పదు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కులగణన నిర్వహించాం.

మన నాయకుడు ఇచ్చిన మాటను తూచా తప్పకుండా అమలు చేస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రం మిగతా.. 9లో

# అసెంబ్లీకి జగన్?

- మనసు మార్చుకుని అసెంబ్లీకి హాజరు?
- ధృవీకరించిన వైసీపీ వర్గాలు
- మంచి నిర్ణయమంటూ వెల్లువెత్తుతున్న అభినందనలు
- పూర్తి స్థాయి సమావేశాల వరకూ ఉంటారని రఘురామకృష్ణంరాజు ఆశాభావం
- సంతకం పెట్టి వెళ్లిపోతారన్న వ్యాఖ్యలను నమ్మనన్న రఘురామ
- జగన్‌కు ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉందని వ్యాఖ్య
- వైసీపీ కొత్త ఎమ్మెల్యేల ఆనందం
- మాట్లాడే అవకాశం వస్తుందన్న ఆశ

(సుబ్బు)

వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మనసు మార్చుకుని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరుకానున్నారు.



కీలకమైన బడ్జెట్ సమావేశాలకు హాజరయి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలని జగన్ నిర్ణయించుకున్నట్లు వైసీపీ వర్గాలు సైతం ధృవీకరిస్తున్నాయి. దీనికి సంబంధించి జగన్ తన పార్టీ సీనియర్లతో చర్చించిన తర్వాత, అసెంబ్లీకి హాజరుకావాలని నిర్ణయించు కున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

తనను ప్రధాన ప్రతిపక్షనేతగా గుర్తించేవరకూ సభకు రానంటూ, శాసనసభను బహిష్కరించిన వైసీపీ అధినేత జగన్.. ఎట్టకేలకూ మనసు మార్చుకున్నట్లు మిగతా.. 2లో

# వచ్చేనెలలో కొత్త రేషన్‌కార్డులు

- ఆధునిక టెక్నాలజీతో క్యూ ఆర్ కోడ్ కార్డులు అందిస్తాం
- మహిళలందరూ ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి
- జిల్లాలో 4లక్షల మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు
- మే నెల నుంచి మధ్యాహ్న భోజనానికి, సంక్షేమ హాస్టళ్లకు సన్నబియ్యం
- రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- సంగంలో రైసుమిల్లు, జెండాదిబ్బలో స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేసిన మంత్రి



**సంగం/బుచ్చి/నెల్లూరు, ఫిబ్రవరి 22:** రాష్ట్రవ్యాప్తంగా వచ్చేనెల నుంచి కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి నాదెండ్ల పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సంగం సమీపంలోని రైసు మిల్లును, జెండాదిబ్బ వద్దనున్న బహుళ ప్రయోజన సౌకర్య గోదాము (స్టాక్ పాయింట్)ను మంత్రి తనిఖీ చేశారు. రైసుమిల్లును తనిఖీ చేసి ధాన్యం సేకరణకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెండాదిబ్బ వద్ద స్టాయిపాయింట్‌ను తనిఖీ చేసి స్టాకు వివరాలు, సరఫరా మొదల్కైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మహిళలనుద్దేశించి మాట్లాడారు. వచ్చేనెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక టెక్నాలజీతో క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 23, ఫిబ్రవరి 2025 ‖





## పోలీస్ శాఖ అవసరాలు తీరుస్తాం

- దేశంలో తెలంగాణ పోలీస్‌కు మంచి పేరు ఉంది
- రాష్ట్రం నగర రాజ్యముగ అభివృద్ధి చెందుతుంది.. ఆ మేరకు భద్రత పెరగాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్,మహానాడు: రాష్ట్రంలో ప్రతి పౌరుడు సురక్షితంగా జీవిస్తున్నారు అన్న భరోసాతో ఉండాలి, ఆ మేరకు పోలీసు శాఖ అవసరాలు తీర్చే బాధ్యత మేము తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో హోం శాఖ ప్రీ బడ్జెట్ సమావేశాల్లో ఆయన పలు అంశాలపై పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు.తెలంగాణ రాష్ట్రం శర వేగంగా అభివృద్ధి చెందుతుంది, నగర రాజ్యముగ రాష్ట్రం స్థిరపడుతుంది అని వివరించారు.

హైదరాబాదులో ప్రస్తుతం ఉన్న మూడు నగరాలకు తోడు నాలుగవ నగరం ఫ్యూచర్ సిటీ సైతం సిద్ధం అవుతుంది, రీజినల్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక వనరులు, వాతావరణం, ఉపాధి అవకాశాల నేపథ్యంలో పెద్ద ఎత్తున హైదరాబాద్ కు, రాష్ట్రానికి వలసలు పెరుగుతున్నాయని ఈ మేరకు భద్రత విషయంలో హోం శాఖ సిద్ధం కావాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. సరిహద్దుల్లో ఉండే సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కరిస్తామని పోలీసు ఉన్నతాధికారులకు డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు.

దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరు ఉంది, ప్రధానంగా సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం విషయంలో దేశంలో అగ్రస్థానంలో ఉన్నారు అందుకు ఉన్నతాధికారులు, సిబ్బందికి డిప్యూటీ సీఎం అభినందనలు తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నివాసానికి క్వార్టర్స్ నిర్మించాల్సిన అవసరం ఉందని, రాష్ట్రంలో ఎక్కడెక్కడ పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి అవకాశం ఉందో వెంటనే ప్రతిపాదనలు పంపించాలని డిప్యూటీ సీఎం పోలీస్ ఉన్నతాధికారులను కోరారు.

సి ఎస్ ఆర్ నిధులు సమీకరించేందుకు అవకాశం ఉన్న ప్రతి చోట అధికారులు ప్రయత్నం చేయాలని, పోలీస్ శాఖ బలోపేతానికి వాటిని వినియోగించుకోవాలని సూచించారు. గత ఏడాది కాలంగా పోలీస్ శాఖలో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య, ప్రస్తుతం ఉన్న ఖాళీల వివరాలు



పైన సమీక్షించారు. గ్రేహౌండ్స్, నార్కోటిక్స్, ఇంటలిజెన్స్, ఫైర్, ఎక్స్ సర్వీస్ మెన్ మొత్తం ఎనిమిది విభాగాల ఉన్నతాధికారులు వారి బడ్జెట్ అవసరాల పై సమావేశంలో నివేదిక సమర్పించారు.

డిజిపి జితేంద్ర మొత్తం శాఖ పరంగా రానున్నయ్యడానికి అవసరమైన బడ్జెట్ పై నివేదిక సమర్పించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రవి గుప్తా, డీ జీఅభిలాష్ బిస్త్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, హైదరాబాద్ సిటీ కమిషనర్ సివి ఆనంద్, రాచకొండ సి పి సుధీర్ బాబు, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు సీపీఆర్వో ఆలూరి రమేష్

మొదటి పేజీ తరువాయి..

చంద్రబాబు వద్ద మీడియా వ్యవహారాలు చూస్తున్నారు. అయితే ఇకపై సీపీఆర్వో ఉత్తర్వుల ద్వారా అధికారంగా పనిచేయనున్నారు. 2002 ఆంధ్రజ్యోతి జర్నలిజం స్కూల్ తొలి బ్యాచ్ ద్వారా రమేష్ మీడియాలోకి వచ్చారు. ఆంధ్రజ్యోతి రీ ఓపెన్ సమయంలో విజయవాడ ఆఫీస్ లో ట్రైనీ సబ్ ఎడిటర్‌గా జాయిన్ అయ్యారు. తర్వాత గుంటూరు ఆంధ్రజ్యోతిలో, హైదరాబాద్‌లో రిపోర్టర్‌గా పనిచేశారు. రాష్ట్ర విభజన తరువాత 2015లో విజయవాడ వచ్చిన ఆయన....నాలుగేళ్ల క్రితం చంద్రబాబు వద్ద పిఆర్‌ఓగా చేరారు. చంద్రబాబు సీఎం అయిన తరువాత తొలి రోజు నుంచి ముఖ్యమంత్రి మీడియా వ్యవహారాలను చూసిన రమేష్‌ను....ప్రభుత్వంలోకి తీసుకునేందుకు చంద్రబాబు నిర్ణయించారు.

ఈ మేరకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని, రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు వస్తాయని సమాచారం. మీడియాలో మంచి అనుభవం, అందరితో పరిచయాలు ఉన్న రమేష్... కొత్త బాధ్యతల్లో సక్సెస్ అవ్వాలని కోరుకుందాం.

## వచ్చేనెలలో కొత్త రేషన్‌కార్డులు

మొదటి పేజీ తరువాయి..

రేషన్‌కార్డులను అందిస్తామని చెప్పారు. రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తామన్నారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియ మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన దీపం-2 పథకం హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారని, ఇందులో భాగంగా ఈ జిల్లాలో 4లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 93.42లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, ఈ ఏడాది 1.50 కోట్లు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా వున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమా చారం మహిళలందరూ తెలుసుకోవాలని, భాగస్వామ్యం కావాలని సూచిం చారు. మే నెల నుంచి అన్ని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మంచి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అహర్నిశలు శ్రమిస్తూ అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ కూడా మంచి పరిపాలన అందిస్తున్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి ఆశీస్సులు అందించాలని కోరారు.

## ఎస్‌ఎల్‌బీసీ సొరంగం వద్ద కుప్పకూలిన పైకప్పు

- ఏడుగురు కార్మికులకు తీవ్రగాయాలు
- సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- మంత్రులు, అధికారులను వెళ్లాలని ఆదేశం
- ఇది రేవంత్ సర్కారు అసమర్థత అంటూ విపక్షాల విమర్శలు

దోమలపెంట: పునఃప్రారంభమైన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో అపశ్రుతి చోటుచేసుకున్నది. శనివారం ఉదయం ఎడవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద ప్రమాదం జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో పనులు జరుగుతుండగా టన్నెల్ పైకప్పు 3 మీటర్ల మేర పడిపోయింది. దీంతో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని రక్షించిన తోటి కార్మికులు హుటాహుటిన జెన్‌కో హాస్పిటల్‌కు తరలించారు.ఎస్‌ఎల్‌బీసీ ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విషయం తెలుసుకున్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఘటనా స్థలికి బయల్దేరారు.

సొరంగంలోని రింగ్‌లు కిందపడటంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నది. దీంతో అందులో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మార్నింగ్ షిఫ్ట్‌లో 40 మంది కార్మికులు కార్మికులు పనిలోకి వెళ్లారు. ప్రమాదం అనంతరం సొరంగం నుంచి ఒక్కొక్కరిగా బయటకు వస్తున్నారు. ఘటనా స్థలం వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. ఐదేండ్ల విరామం తర్వాత ఈ నెల 18న సొరంగం తవ్వకం పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి.


టన్నెల్ బోరింగ్ మిషన్‌తో సొరంగం తవ్వకం చేపట్టగా సాంకేతిక సమస్యలు, వరద సమస్యలతో పనులు ఆగుతూ సాగుతున్నాయి. కాగా, మొత్తం ఇన్ లెట్, అవుట్ లెట్ సొరంగాలు కలిపి 44 కిలోమీటర్లు తవ్వాల్సి ఉండగా.. 9.559 కిలోమీటర్ల తవ్వకం పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

### ఉత్తమ్ మాటలు హాస్యాస్పదం: కేటీఆర్

ఎస్‌ఎల్‌బీసీ ప్రమాద ఘటనపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ ప్రమాద ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. నాలుగు రోజులు క్రితమే మొదలయిన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో జరిగిన ప్రమాదాన్ని దాచిపెట్టడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు వారి ఆలోచనలకు అద్దం పడుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రమాదం పొద్దున్న 8:30 గంటలకు జరిగితే మధ్యాహ్నం వరకు ప్రభుత్వంలో చలనం లేకపోవడం అత్యంత దురదృష్టకరం. ఇప్పటి వరకు ఎంతమంది కార్మికులు చిక్కుకున్నారో కూడా తెలియని స్థితిలో యంత్రాంగం ఉందని కేటీఆర్ తెలిపారు.సీపేజ్ వచ్చింది, అందుకే కూలింది అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదం.

సీపేజ్ వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎందుకు పాటిం



చాలేదు? సుంకిశాల ప్రమాదంలా దాచిపెట్టే ప్రయత్నం చెయ్యకుండా.. ఇప్పటికైనా ఎంతమంది కార్మికులు లోపల ఇరుక్కున్నారు, వారిని రక్షించడానికి ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నారో వెంటనే చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్ సర్కార్ చేతగాని తనానికి నిదర్శనం: హరీశ్‌రావు

కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న ఎస్‌ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం కాంగ్రెస్ సర్కార్ అసమర్థతకు, చేతగాని తనానికి నిదర్శనం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. చేయక చేయక ఒక ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఆరంభంలోనే అంతం చేసిన ఘనత కాంగ్రెస్ పాలకులదే అని విమర్శించారు. మొన్న సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కూలిన ఘటన, నేడు ఎస్‌ఎల్‌బీసీ సొరంగం కుప్ప కూలడం కాంగ్రెస్ కమిషన్ సర్కారు వైఫల్యానికి నిదర్శనం అని హరీశ్‌రావు విమర్శించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. గత నాలుగు రోజులుగా కొద్దికొద్దిగా మట్టి కూలుతున్నదనీ గుర్తించినప్పటికి ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం రేవంత్ సర్కార్ నిర్లక్ష్యమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరికొంత మంది కార్మికులు లోపల ఉన్నట్లు తెలుస్తుంది. వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలి. డీ వాటరింగ్ చేసి, వెంటనే విద్యుత్ పునరుద్ధరించి, శిథిలాలను తొలగించి కార్మికులను వెంటనే బయటకు తీసుకురావాలి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వెంటనే ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నాం

## గ్రూప్-2 మెయిన్స్ యథాతథం

మొదటి పేజీ తరువాయి..

కొన్ని ప్రాంతాల్లో ఏర్పాట్లను మరిన్ని కట్టుదిట్టంగా చేశారు.

ఆ టైమ్ దాటితే అనుమతించరు: ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పేపర్-1 పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు ఉదయం 9.30 గంటలలోపు ఆయా ఎగ్జామ్ సెంటర్లకు చేరుకోవాలి. ఉదయం 9.45 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసి వేస్తారు. ఆలస్యంగా వెళ్లిన లోనికి అనుమతించరు. అదే విధంగా మధ్యాహ్నం 3:00 గంటల నుంచి 5.30 గంటల వరకూ పేపర్-2 పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు మధ్యాహ్నం 2.30 గంటలలోగా ఆయా ఎగ్జామ్ సెంటర్లకు చేరుకోవాలి. మధ్యాహ్నం 2.45 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేసి, ఆ తర్వాత వచ్చిన వారిని లోనికి అనుమతించరు. ఇవి తీసుకొని వెళ్లకూడదు: గ్రూప్-2 మెయిన్ పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 ఉంటుంది. అదే విధంగా పరీక్షా కేంద్రాలకు దగ్గర్లో జిరాక్సు, నెట్ సెంటర్లను మూసి వేస్తారు. పరీక్ష హాలులోకి సెల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ వాచీలను, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఎట్టిపరిస్థితుల్లోను అనుమతించరు.

## ‘ఎమ్మెల్సీ’లకు ఏపీపీఎస్సీ అగ్ని ‘పరీక్ష’

మొదటి పేజీ తరువాయి..

పలువురు కార్పొరేషన్ చైర్మన్ల వద్దకు వివిధ పనుల కోసం వెళ్లే పార్టీ వర్గాలకు నిరాశే ఎదురవుతోందంటున్నారు. ఫలానా ఎండీ మన మాట వినరనో, మీరు చెప్పిన పని రూల్సుకు విరుద్ధమనో చెబుతూ తప్పించుకుంటున్నారన్న ఫిర్యాదులు పార్టీ కార్యాలయానికి చేరుతున్నాయి.

కాగా అనూరాధ కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో ఉన్నందున, ఏపీపీఎస్సీ వ్యవహారాలు పెద్దగా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. కార్యదర్శిగా ఉన్న అధికారి కూడా లేకపోవడంతో, న రసింహమూర్తి అనే అధికారికి ఇన్చార్జి సెక్రటరీ బాధ్యతలు అప్పగించారు. ఆయన చాలా ఏళ్ల క్రితమే ఢిల్లీ నుంచి వచ్చి ఏపీపీఎస్సీలో పనిచేస్తున్నారు. ఇప్పుడు ఆ అధికారే సీఎం చంద్రబాబు లేఖను బుట్టదాఖలు చేసి, పరీక్ష వాయిదాకు ససేమిరా అని, పరీక్ష నిర్వహిస్తుండటం విశేషం.

తాజా పరిణామాలు నైతికంగా-రాజకీయంగా కూటమిని దారుణ అవమానానికి గురిచేశాయి. కార్యకర్తల్లో అంతర్మథానికి కారణమయ్యాయి. ఈనెలలో నాలుగు జిల్లాల్లో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, మూడు జిల్లాల్లో జరగనున్న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఏపీపీఎస్సీ పరీక్ష వాయిదా ప్రభావం పడే ప్రమాదం కనిపిస్తోంది. పరీక్ష వాయిదా వేస్తామన్న చంద్రబాబు మాట నిలబెట్టుకోకుండా, వేలాదిమంది విద్యార్థులను మోసం చేశారంటూ వైసీపీ, పీడీఎఫ్ నేతలు ఇప్పటికే ప్రచారం ఉధృతం చేశారు. మరోవైపు విశాఖలో అభ్యర్థులు రోడ్డెక్కి ధర్నాలకు దిగారు. విజయవాడలో సైతం అభ్యర్థులు ఏపీపీఎస్సీ ఆఫీసు వద్ద ధర్నా చేసే ప్రయత్నం చేశారు. ఈ ఘటనల్లో పోలీసులు వారిపై లాఠీచార్జి చేయడం, పీడీఎఫ్ అభ్యర్థులకు వరంగా, టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు శాపంగా పరిణమించింది. నిజానికి ఇంటెలిజన్స్ నివేదికల ప్రకారం.. నాలుగు జిల్లాల్లో టీడీపీ-పీడీఎఫ్ అభ్యర్థులకు, జిల్లాకు 20 వేల ఓట్లు మాత్రమే తేడా ఉన్నట్లు సమాచారం. అంటే గుంటూరు-కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో అధికార-విపక్ష అభ్యర్థుల మధ్య కేవలం 20 వేల ఓట్ల తేడా మాత్రమే ఉందని తెలుస్తోంది. ప్రస్తుతానికి టీడీపీ అభ్యర్థులు తొలి ప్రాధాన్యం ఓట్లతో గెలిచే పరిస్థితులు లేవని, ఈ దశలో పరీక్ష వాయిదా వేయని ఆగ్రహం పీడీఎఫ్ అభ్యర్థులకు వరంగా పరిణమిస్తుందని మంత్రులు, ఎమ్మెల్యేలు బాహాటంగానే మొత్తుకుంటున్నారు.‘నాలుగు జిల్లాల్లో చెరో 25 వేల ఏపీపీఎస్సీ అభ్యర్థుల ఓట్లు పీడీఎఫ్‌కు పోలయినా మా అభ్యర్థులు ఓడిపోవటం ఖాయమని’ ఓ మంత్రి వ్యాఖ్యానించారు. ఇప్పటికే రెండు చోట్లా అభ్యర్థులను ఎమ్మెల్యేల నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థులకు సరైన సహకారం లేదని, ఆ తలనొప్పికి తోడు ఈ పరీక్షల తలనొప్పి మా అభ్యర్థులకు ఎసరు తెస్తోందని ఓ మాజీ మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

తాజాగా అధికారుల చేతిలో ఎదురైన పరాభవ పర్వాన్ని దృష్టిలో ఉంచుకునయినా ఇకపై అధికారులకు ప్రాధాన్యం ఇవ్వడం మానేయాలని టీడీపీ సీనియర్లు స్పష్టం చేస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ, అధికారుల పాలనే ఉంటుందన్న నిజాన్ని ఈసారి కూడా రుజువు చేశారని పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. “ ఎన్నికల ముందు ప్రతిసారి అధికారంలో ఉన్నప్పుడు అధికారులకు సమయం ఇచ్చి తప్పు చేశాం. ఇకపై కార్యకర్తలకే ఎక్కువ సమయం కేటాయిస్తా అనటం. అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ అధికారులకే పెత్తనం ఇవ్వడం మా సారుకు అలవాటయింది. మాకు ఇవన్నీ తప్పవు కదా?” అని ఓ మాజీ మంత్రి వ్యాఖ్యానించారు.

జగన్ సీఎంగా ఉండగా అధికారులు హడలిపోయి, వైసీపీ నేతలు చెప్పిన పని చేశారని పార్టీ సీనియర్లు గుర్తు చేస్తున్నారు. ‘మరి అదే అధికారులు మా పార్టీ వస్తే మా మాట ఎందుకు వినరు? ఎందుకు ఎదురు చెబుతున్నారు? వాళ్ల పెత్తనం ఎందుకు సాగుతుంది? అంటే తప్పు ఎవరిది? వాళ్లకు పెత్తనం ఇచ్చిన మా ప్రభుత్వానిదా? అడ్డుకోలేని మాదా? అని ఓ సీనియర్ ఎమ్మెల్యే ఆవేశంగా ప్రశ్నించారు. పైన ఉండేవారి బట్టే కింద ఉన్న వారు పనిచేస్తారని వ్యాఖ్యానిస్తున్నారు.

## అసెంబ్లీకి జగన్?

మొదటి పేజీ తరువాయి..

పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షనేగా గుర్తించాలంటూ కోర్టులో కేసువేసినందున.. అది తేలేవరకూ అసెంబ్లీకి హాజరు కావాలన్న పార్టీ సీనియర్ల సూచన మేరకు, జగన్ అసెంబ్లీకి హాజరుకావాలని నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నారు.

గత ఎనిమిది నెలల నుంచి తన పార్టీ క్షేత్రస్థాయిలో చేసిన ప్రజా పోరాటాలు, వివిధ అంశాలపై తనతో సహా పార్టీ నేతలు వివిధ అంశాలపై చేసిన ఆరోపణలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లేందుకు, అసెంబ్లీనే సరైన వేదిక అని సీనియర్లు జగన్‌కు సూచించారు. నందిగం సురేష్, వంశీ అరెస్టు సహా పార్టీ నేతలపై కేసులతోపాటు.. రైతు సమస్యలు, నిలిపివేసిన తమ పథకాలపై మాట్లాడే అవకాశం వదులుకోవద్దని సీనియర్లు హితవు పలికినట్లు వినికిడి. పైగా కీలకమైన బడ్జెట్ సమావేశాలయినందున.. గతంలో తమ ప్రభుత్వం చేసిన కేటాయింపులను, ప్రస్తుత బడ్జెట్‌తో పోల్చి వాస్తవాలను ప్రజలకు వివరించే అవకాశం వదులుకోవడం, తెలివైన నిర్ణయం కాదని పలువురు సూచించినట్లు సమాచారం.



దీనితో అసెంబ్లీకి రానంటూ గతంలో చేసిన ప్రకటనకు భిన్నంగా.. సభకు హాజరుకావాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. పైగా సభకు హాజరయి ప్రజా సమస్యలపై చర్చించాలంటూ కూటమి నాయకులు చేస్తున్న సవాళ్లు, సభకు వస్తే మాట్లాడేందుకు అవకాశం ఇస్తామన్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ప్రకటనల్లో వాస్తవమెంతో కూడా తేలిపోతుందని పలువురు సీనియర్లు జగన్ వద్ద వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఒకవేళ సభకు వచ్చినా జగన్‌కు అవకాశం ఇవ్వకపోతే, దానిని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వమే ఒక అవకాశం ఇచ్చినట్టవుతుందని జగన్ వద్ద విశ్లేషించినట్లు తెలుస్తోంది.

‘జగన్ గారు బడ్జెట్‌పై కచ్చితంగా గత మా ప్రభుత్వంలో చేసిన కేటాయింపులు-ఇప్పటి కేటాయింపుల గురించి మాట్లాడే సందర్భంలో సహజంగా విమర్శలు చేస్తారు. అప్పుడు ప్రభుత్వం ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేస్తుంది. కూటమి సభ్యులు ఆయనను మాట్లాడనీయరు. ఆ క్రమంలో సభలో ఆవేశకావేశాలు చోటు చేసుకుంటాయి. సహజంగా ప్రభుత్వ సూచనల మేరకు, జగన్ మినహా మా సభ్యులను కొద్దిరోజులు సభ నుంచి సస్పెండ్ చేస్తారు. ఆ తర్వాత జగన్ గారు స్పీకర్ అనుమతితో మాట్లాడి, ప్రభుత్వ నిర్ణయాన్ని తూర్పారపట్టి సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటిస్తారు. బయటకు వచ్చిన తర్వాత ఎలాగూ మీడియాతో బడ్జెట్‌పై మా వాదన వినిపిస్తా”మని వైసీపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

కాగా జగన్ సభకు హాజరుకానున్నారన్న వార్తలపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు సానుకూలంగా స్పందించారు. ‘జగన్‌కు సభకు హాజరయ్యే ధైర్యం ఉందనుకుంటున్నా. ఆయనకు గతంలో ప్రజాస్వామ్యంపై నమ్మకం లేకపోయినా, ఇప్పుడు నమ్మకం ఉన్నట్లు భావిస్తున్నా. సభకు రావడం సభ్యుడిగా ఆయన హక్కు. దానిని ఎవరూ అడ్డుకోలేరు. సభా నిబంధనల మేరకు ఒక సభ్యుడికి ఇచ్చే అవకాశాలన్నీ జగన్‌కూ ఉంటాయి. దానిపై ఎలాంటి సందేహ ం లేదు. నేనేదో జగన్ వస్తే మైకు ఇవ్వనన్న ప్రచారం సత్యదూరం. బయట వరకే పార్టీలు, రాజకీయాలు. సభలోకి వస్తే అందరూ సమానమే. కాకపోతే నిబంధనల మేరకు మాట్లాడే అవకాశం ఉంటుంది. ఆ విషయం ఎంపీ, ఎమ్మెల్యే, సీఎంగా చేసిన జగన్‌కూ తెలుసనుకుంటా. బడ్జెట్‌పై జగన్ తన పార్టీ వైఖరితోపాటు, ప్రభుత్వానికి కొన్ని విలువైన సూచనలు చేస్తే ఆయనకే గౌరవం పెరుగుతుంది” అని రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించారు.

అయితే సభకు హాజరుకాకపోతే అనర్హత వేటు వేస్తారనే భయంతోనే జగన్ సభకు వస్తున్నారన్న సోషల్‌మీడియా వార్తలను తాను ప్రస్తుతానికి నమ్మటం లేదని రఘురామ చెప్పారు.

‘ఆయనకు సభకు వచ్చే ధైర్యం ఉందనుకుంటున్నా. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు, బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ సభకు వస్తారనే ఆశిస్తున్నా. అలా కాకుండా ఒకరోజు సంతకం చేసి వెళ్లిపోయేంత పిరికితనం, ఆయనలో ఉందనుకోవడం లేదు. ఏదేమైనా జగన్ సభకు హాజరుకావడాన్ని సాటి సభ్యుడిగా, డిప్యూటీ స్పీకర్‌గా స్వాగతిస్తున్నా’నని రాజు చెప్పారు.

జగన్ సభకు వస్తే ఆయనను ఆట పట్టిస్తారని, ఆయనకు మైకు ఇవ్వరంటూ సోషల్‌మీడియాలో వస్తున్న కథనాలను రాజు త్రోసి పుచ్చారు. బహుశా సభా సంప్రదాయాలపై అవగాహన లేని వారే అలా ప్రచారం చేస్తూ ఉండవచ్చన్నారు. “జగన్‌ను మిగిలిన సభ్యుల మాదిరి గానే గౌరవిస్తామే తప్ప, ఎందుకు ఆటపట్టిస్తాం? అసలు ఆట పట్టించాల్సిన అవసరం ఎవరికి ఉంది? మాకు హుందాతనం తెలియదా? మాకు ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంది. గతంలో ఎలా ఉన్నా ఈ సభను మాత్రం స్పీకర్‌గారు, నేను స్వతంత్రంగానే నడుపుతాం. ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. అందుకే అంత నమ్మకంగా చెబుతున్నా. మరి అలా గతంలో జరిగిందేమో నాకు తెలియదు. ఎందుకంటే నేను గతంలో సభలో సభ్యుడిని కాదు కాబట్టి” అని రఘురామ వ్యాఖ్యానించారు.


కాగా జగన్ సభకు హాజరుకావాలన్న నిర్ణయాన్ని ప్రజాస్వామ్యవాదులు స్వాగతిస్తున్నారు. ఆయన మనసుమార్చుకుని సభకు హాజరుకావడాన్ని అభినందిస్తున్నారు.

ప్రజాసమస్యలను ప్రస్తావించాల్సిన ప్రతిపక్షం బయట ఉండటం మంచిదికాదని, సభలో ఉండి ప్రభుత్వంపై ఒత్తిడి చేయడమే ప్రతిపక్ష ధర్మం అని స్పష్టం చేస్తున్నారు.

జగన్ నిర్ణయంపై ప్రధానంగా వైసీపీనుంచి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకూ తాము సభకు వెళ్లనందున, మాట్లాడే అవకాశం రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు అసెంబ్లీలో ఎవరి గదులు ఏమిటో, ఎక్కడ ఏం ఉందో కూడా పరిశీలించే అవకాశం రాలేదని వాపోతున్నారు. దానికితోడు మా ఎమ్మెల్యే సభలో కనిపించడం లేదని కొందరు, సభకు వెళ్లని దానికి ఎమ్మెల్యేగా ఉండి ఏం ఉపయోగమంటూ మరికొందరు.. నియోజకవర్గ ప్రజల నుంచి వినిపిస్తున్న విమర్శలకు జవాబు చెప్పలేక తలపట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జగన్ సభకు హాజరుకావాలన్న నిర్ణయం వారిని ఆనందపరుస్తోంది.

## వాయిదా వేస్తున్నామని నమ్మించి మోసం చేసింది

- అభ్యర్థులపై పోలీసుల లాఠీఛార్జీని కూడా తీవ్రంగా ఖండిస్తున్నాం.
- గ్రూప్ 2 పరీక్ష వ్యవహారంపై శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



విశాఖపట్నం: గ్రూప్ 2 అభ్యర్థుల వ్యవహారంపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

ఈ గందరగోళానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఒకవైపు వాయిదా వేయిస్తున్నామంటూ చెప్పి మరోవైపు తమ చేతుల్లో లేదని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. నిన్నఅభ్యర్థుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటున్నట్టు విద్యాశాఖమంత్రి ట్వీట్ చేశారు.

మరోవైపు తాము వాయిదా వేయమనే చెప్పామంటూ ముఖ్యమంత్రి పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఆడియో రాష్ట్ర ప్రజలంతా విన్నారు. ఇంకోవైపు గ్రూప్ 2 పరీక్ష వాయిదా అంటూ వార్తలు వేసిన ఛానెళ్లు మీద కేసులు పెట్టారు. ఇంత అయోమయం, గందరగోళం ఉన్న ప్రభుత్వాన్ని నేనెప్పుడూ చూడలేదు.

చివరిదాకా వాయిదా వేస్తున్నామని నమ్మించి ఈ ప్రభుత్వం గ్రూప్ 2 అభ్యర్థులను మోసం చేసింది. ఆందోళన చేస్తున్న అభ్యర్థులపైన పోలీసుల లాఠీఛార్జీని కూడా తీవ్రంగా ఖండిస్తున్నాం.

పోలీసులు అదుపులోకి తీసుకున్న అభ్యర్థులను బేషరతుగా వెంటనే విడుదల చేయాలి.

ప్రభుత్వం తక్షణమే అత్యవసరంగా సమావేశమై గ్రూపు 2 అభ్యర్థులకు స్పష్టతనివ్వాలి.

ఇంతటి గందరగోళం మధ్య పరీక్ష నిర్వహణ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదు.

ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే దీనిపై అత్యవసర సమావేశం నిర్వహించి పరీక్ష వాయిదా వేయాలి. అభ్యర్థుల ఆందోళనపై స్పష్టతనిచ్చిన తర్వాత మాత్రమే పరీక్ష నిర్వహించాలి.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 23, ఫిబ్రవరి 2025



# అయోమయంలో గ్రూప్-2

- ప్రభుత్వ సూచన లెక్కచేయని ఏపీపీఎస్సీ-
- అభ్యర్థుల్లో అయోమయం!

(వాసు)

ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్ 2 పరీక్ష గందరగోళంలో పడింది. అసలు పరీక్ష ఉంటుందో పోస్టుపోన్ అవుతుందో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. పరీక్షలు వందల కిలోమీటర్లు వెళ్లాల్సిన వాళ్లు వెళ్లిపోయారు. మరికొందరు వెళ్లాలా వద్దా అని ఆలోచిస్తున్నారు.

పోస్టుపోన్ చేయాలని ప్రభుత్వం చెబుతున్నా ఆ విన్నపాలను ఏపీపీఎస్సీ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్ ప్రభుత్వం లేఖ రాసినా దానిపై ఇంత వరకు సమాధానం రాలేదు. ఇటు అభ్యర్థుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రం అవుతోంది.

రోస్టర్ విధానంలో చాలా తప్పులు ఉన్నాయని గ్రహించిన ప్రభుత్వం.. అభ్యర్థులు కోరిక మేరకు వాయిదా వేయాలని ఏపీపీఎస్సీకి లేఖ రాసింది. శుక్రవారమే ఆ లేఖను ఏపీపీఎస్సీకి రాసింది. లేఖ రాసి 24గంటలు అవుతున్నా ఏపీపీఎస్సీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. గ్రూప్ 2 పరీక్ష కూడా వాయిదా వేస్తున్నట్టు ప్రకటన చేయలేదు.

ప్రభుత్వం లేఖ రాయడమే కాకుండా ఇద్దరు నేతలను కూడా ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్ వద్దకు పంపించారు. ఆరోగ్యం బాగాలేదని ఆమె కలవలేదు. దీంతో వాళ్లిద్దరు తిరిగి వచ్చేశారు. విషయాన్ని ప్రభుత్వానికి చెప్పారు. తప్పులు సరిచేయకుండా పరీక్ష నిర్వహించే తమకు, నష్టం జరుగుతుందని చాలా మంది అభ్యర్థులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు.






మధ్యాహ్నం వరకు ఓపిక పట్టిన ప్రభుత్వం లేఖ రాసిన విషయాన్ని మీడియాకు తెలియజేసింది.

ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఏపీపీఎస్సీ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఛైర్‌పర్సన్ కూడా అందుబాటులోకి రావడం లేదని తెలుస్తోంది. అంతేకాకుండా ఏపీపీఎస్సీ ఫోన్ నెంబర్లు కూడా పని చేయడం లేదు. మీడియా సంస్థలకు అభ్యర్థులు ఫోన్లు చేస్తున్నారు. ఏదో ఒకటి చెప్పాలని రిక్వస్ట్‌లు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా అనురాధను నియమించారు. సిన్సియర్ ఆఫీసర్‌గా ఆమెకు పేరు ఉంది. ఏపీపీఎస్సీ కూడా స్వతంత్ర సంస్థ. దీన్ని రాజకీయ ఒత్తిళ్లు లేకుండా నడపాలనే ఉద్దేశంతో ఆమెను తీసుకొచ్చి ఈ పోస్టులో పెట్టారు. ఇప్పుడు ఆమె ప్రభుత్వం మాట వినడం లేదని అంటున్నారు. ఆమె తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అంసతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

# నీ పాలన ఎట్లుందో నీ డ్రైవర్లను అడుగు

- నీ దగ్గర పనిచేసే ఉద్యోగులను అడుగు
- సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చురుక
- సీఎం రేవంత్ రెడ్డి చేసిన సవాలుపై స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్: ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాదు కానీ సవాల్ విసురుతున్నాడు సీఎం రేవంత్ రెడ్డి .ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తావో చెప్పు. ఇచ్చిన హామీల్లో కనీసం 20% అమలు చేసి సవాల్ చేస్తే దానికి అర్థం ఉంటుంది.

నిరుద్యోగులకు ఉద్యోగాలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చెయ్యి. విద్యార్థినులకు స్కూటీలు రైతు భరోసా కౌలు రైతులు రైతు కూలీలకు డబ్బులు ఇవ్వు. మీ సెక్రటరియేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల్ని మీ ఆఫీసులో పనిచేస్తున్న ఉద్యోగులని, మీ దగ్గర మీ ఆఫీస్ ల్లో పని చేస్తున్న డ్రైవర్లని కార్మికులను అడిగితే తెలుస్తది మీ పరిపాలన ఎట్లుందో.

వాళ్లే చెప్తారు మీ పరిపాలన ఎట్లుంది. మీ పరిపాలనపై చర్చకు



రావాలా? ముందు మీ రాహుల్ గాంధీతో కలిసి ఇచ్చిన హామీలను అమలు చేయి అప్పుడు సవాల్ కు నేను రెడీ.

# మాది ప్రజా ప్రభుత్వం.. ప్రజలకు అండగా ఉంటా

- ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు.
- ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన మంత్రి సుభాష్

రామచంద్రపురం: ప్రజలే దేవుళ్ళు.. సమాజమే దేవాలయం అనే నినాదంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్( ప్రజల నుంచి వినతుల స్వీకరణ కార్యక్రమం ) నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. శనివారం మంత్రి రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీలను క్షుణంగా పరిశీలించి తక్షణ చర్యలు గైకొంటామని ఈ సందర్భంగా మంత్రి సుభాష్ అర్జీదారులకు హామీ ఇచ్చారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ తొలి ప్రాధాన్యత అని వెల్లడించారు.

అర్జీదారుల సమస్యలు కూలంకుషంగా విన్న మంత్రి సుభాష్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ఇది ప్రజలచే ఎన్నుకోబడిన మంచి ప్రభుత్వం అని, ప్రజా సంక్షేమం, రాష్ట్ర పురోభివృద్ధి స్వర్ణాంధ్ర విజన్ -2047 లక్ష్యంతో కూటమి ప్రభుత్వపాలన ముందుకు సాగుతుందన్నారు. రామచంద్రపురం



నియోజవర్గంలోనే కాకుండా కూటమి ప్రభుత్వం రాష్ట్ర రాజధాని అమరావతిలో కూడా ప్రజాదర్బార్ ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

# బాబుకు రేవంత్ రెడ్డి గోదావరి జలాల గురుదక్షిణ

- ప్రజా భవన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ తర్వాతే బనకచర్ల ప్రాజెక్టును ప్రకటించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- రేవంత్ రెడ్డి జుట్టు చంద్రబాబు చేతిలో ఉంది
- తక్షణమే బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కేంద్రానికి లేఖ రాయాలి
- పసుపు బోర్డుకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలి
- సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసి సీఎం రేవంత్ రెడ్డి తీరు మారలేదు
- సుప్రీం కోర్టు తిట్టిన మొట్టమొదట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావడం తెలంగాణ కర్మ
- నిజామాబాద్‌లో పసుపు మార్కెట్ యార్డును సందర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత





నిజామాబాద్: ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుకు గురుదక్షిణగా కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్పిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుపై ఉన్న ప్రేమ తెలంగాణ రైతాంగంపై ఎందుకు లేదని రేవంత్ రెడ్డిని ఎమ్మెల్సీ కవిత నిలదీశారు. తెలంగాణ రైతుల కంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చంద్రబాబే ఎక్కువనా అని ప్రశ్నించారు. బ్యాగులతో దొరికిన రేవంత్ రెడ్డి జుట్టు చంద్రబాబు చేతిలో ఉందని, అందుకే చంద్రబాబు చెప్పినట్లు సీఎం రేవంత్ రెడ్డి నడుచుకుంటున్నారని ధ్వజమెత్తారు.

శనివారం నాడు నిజామాబాద్ పసుపు మార్కెట్ యార్డును ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. అక్కడ పసుపు రైతులతో మాట్లాడి వారి కష్టాలు, సమస్యలు, మార్కెట్ లో ఉన్న ధరల వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... గతంలో ప్రజా భవన్‌లో ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశంలో తర్వాత బనకచర్ల ప్రాజెక్టు చేపడుతామని చంద్రబాబు ప్రకటించారని, చంద్రబాబుకు రేవంత్ రెడ్డి బ్రీఫ్ చేసిన తర్వాత... ఆయన ప్రకటన చేశారని చెప్పారు. గోదావరి నది నుంచి 200 టీఎంసీలను కృష్ణా, పెన్నా బేసిన్ లకు తరలించడానికి ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు చేపడుతోందని, మన దగ్గరి నుంచి 200 టీఎంసీల నీటిని ఏపీ ఎత్తుకపోతుంటే మూర?పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ నిలబడ్డారని మండిపడ్డారు.

నిజంగా తెలంగాణహితం కోరితే చంద్రబాబు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ కేంద్రానికి ఎందుకు లేఖ రాయడం లేదని, ప్రభుత్వం కోర్టుల్లో ఎందుకు కేసులు వేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఆనాడు ఏపీ ప్రాజెక్టులు చేపడితే, కాలువలు విస్తరిస్తే కేసీఆర్ వ్యతిరేకిస్తూ కేంద్రానికి లేఖలు రాశారని, కోర్టుల్లో కేసులు వేసి స్టేలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని, అవసరమైతే కోర్టుకు వెళ్లి బనకచర్ల ప్రాజెక్టును ఆపాలని డిమాండ్ చేశారు. నోరుందికదా అని సీఎం రేవంత్ రెడ్డి గంప గయ్యాళిలా ఒర్రుతున్నారని విరుచుకుపడ్డారు.

కాగా, పేరుకే గెజిట్ జారీ చేసి కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేసిందని, కానీ చట్టబద్ధత కల్పించలేదని ఎండగట్టారు. దాంతో దాంతో పసుపు ధరలు పడిపోయే పరిస్థితి ఏర్పడిందని, బోర్డుకు చట్టబద్ధత ఉంటే బయటి దేశాల నుంచి వచ్చే నాసిరకం పసుపు దిగుమతులు తగ్గుతాయని, దాని వల్ల స్థానికంగా పసుపుకు మంచి రేటు వస్తుందని వివరించారు.

మార్కెట్ యార్డులో వ్యాపారులంతా సిండికేట్ గా మారి పసుపు ధర తగ్గిస్తున్నారని, నాలుగైదు రోజులు వేచిచూసినా పసుపు కొనడం లేదని తెలిపారు. ఒక రకంగా రైతును బ్లాక్ మెయిల్ చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నదని, ఎంత మంచి నాణ్యతగల పసుపుకు అయినా మంచి ధర ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

పసుపుకు 12 వేల కనీస ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, అంతకు తక్కువ ధర ఉంటే మిగితా డబ్బును బోనస్ రూపంలో ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు కేవలం రూ. 8000 వేలకు మాత్రమే పసుపును కొనుగోలు చేస్తున్నారని, అయినా కూడా ప్రభుత్వం బోనస్ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు.తక్షణమే పసుపుకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పసుపు బోర్డుకు చట్టబద్ధతు, కనీస మద్ధతు ధర కోసం కేంద్రంపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ప్రకటించారు. ధీన స్థితిలో ఉన్న పసుపు రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిందేనని తేల్చిచెప్పారు. వ్యాపారులు రైతులను మోసం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని ధ్వజమెత్తారు. మార్చి 1లోపు బోనస్ ప్రకటించకపోతే జిల్లా కలెక్టరేట్ ను దిగ్బందిస్తామని హెచ్చరించారు.

మరోవైపు, తనపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఎమ్మెల్సీ కవితగా ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసి సీఎం రేవంత్ రెడ్డి తీరు మారలేదని, తనపై మాట్లాడవద్దని సుప్రీం కోర్టు చివాట్లు పెట్టినా రేవంత్ రెడ్డి కామెంట్ చేస్తున్నారని తెలిపారు. సుప్రీం కోర్టు తిట్టిన మొట్టమొదట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావడం తెలంగాణ కర్మ అని అన్నారు. తాను ఆయనలా మాట్లాడి తన స్థాయిని తగ్గించదలుచుకోవడం లేదని స్పష్టం చేశారు. నోరుందికదా అని ఎటుపడితే అటు మాట్లాడితే కుదరదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు.


# కుంభమేళాలో పుణ్యస్నానం అత్యున్నత ఆధ్యాత్మిక అనుభవం

- పులకించి పోయాను
- ఈ ఆధ్యాత్మిక అనుభవం అనిర్వచనీయం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి: ప్రస్తుతం యుపిలో కొనసాగుతున్న మహా కుంభమేళాలో పుణ్యస్నానం ద్వారా కలిగే అనుభవం అనిర్వచనీయమైనదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం నాడు ఆయన ప్రయాగ్ రాజ్‌లో మహా కుంభమేళా సందర్భంగా పవిత్ర గంగా నదిలో పుణ్యస్నానమాచరించారు. ఈ పవిత్ర స్నానం తనకు అత్యున్నత ఆధ్యాత్మిక అనుభవంతో పులకింప చేసిందని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ స్నానం సందర్భంగా హైందవ సంస్కృతి ప్రవాహం యొక్క విశిష్టతను అనుభవపూర్వకంగా తెలుసుకునే అవకాశం తనకు లభించిందన్నారు. ధనిక, పేద కుల, వ్యత్యాసాలకు అతీతంగా ఆధ్యాత్మిక వికాసానికి హిందూ ధర్మం చూపే విశ్వసనీయ మార్గానికి ఈ మహా కుంభమేళా సజీవ సాక్ష్యమని ఆయన అభివర్ణించారు. కోట్లాది మంది భక్తులు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రయాగ్ రాజ్ వద్ద పవిత్ర స్నానం చేయటానికి యుపి ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు అభినందనీయమని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

144 సంవత్సరాలకు ఒకసారి జరిగే ప్రయాగ్రాజ్ మహాకుంభ మేళాలో పాల్గొని పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరించడం తనకు సంతోషం కలిగించిందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుకలో నేను కూడా భాగస్వామిని కావడం చాలా సంతోషంగా ఉందని



ఆయన తన ప్రకటనలో వివరించారు. కోట్లాది మంది ప్రజల నమ్మకాలు, సంప్రదాయాలకు ఈ కుంభమేళా ప్రతీకగా నిలిచిందనీ, హిందూ సంస్కృతి, ఆధ్యాత్మికతను ప్రపంచానికి చాటిచెప్పిందని ఆయన అభివర్ణించారు.

# సీమలో ప్రతి ఎకరాకూ నీరందిస్తాం

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- 'రైతు బడి- అగ్రి షో'ను ప్రారంభించిన మంత్రి
- సాగులో సాంకేతికతకు ప్రాధాన్యమిస్తున్న చంద్రబాబు
- రాయలసీమకు కృష్ణా జలాల తీసుకొచ్చిన ఘనత టీడీపీదే
- వ్యవసాయంలోకి యువత రావాలి
- రైతు ద్రోహి జగన్
- మంత్రి సవిత ఫైర్

అనంతపురం/రాప్తాడు: వ్యవసాయంలో సాంకేతిక వినియోగంతో అధిక దిగుబడులు సాధించొచ్చునని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా సాగులో సాంకేతికకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు.

రాయలసీమకు కృష్ణా జలాలు తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. రాప్తాడులో శనివారం నుంచి రెండ్రోజుల పాటు జరిగే రైతు బడి-అగ్రి షో కార్య క్రమంలో ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాల్వ



శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నాయకుడు పరిటాల శ్రీరామ్ తో కలసి మంత్రి ప్రారంభించారు.

అనంతరం నిర్వహించిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ, మారుతున్న కాలనుగుణంగా వ్యవసాయంలోనూ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఒక వైపు మానవ వనరులు కొరత వేధిస్తున్న సమయంలో



సాంకేతికను వినియోగించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో వ్యవసాయంలో సాంకేతికకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఇప్పటికే వ్యవసాయంలో డ్రోన్ల వినియోగిస్తున్నామన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను 90 శాతం రాయితీపై రైతులకు అందిస్తున్నామన్నారు. వ్యవసాయ, హార్టీకల్చర్ అధికారులు సాంకేతిక వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు.

## రాయలసీమలో ప్రతి ఎకరాకూ నీరందిస్తాం

రాయలసీమలోని ప్రతి ఎకరాకు సాగునీరందించడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు. రాయలసీమకు కృష్ణా జలాలను తీసుకొచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. రాయలసీమలోని అన్ని ప్రాంతాల్లోనూ సాగు, తాగునీరందిచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అసంపూర్తిగా నిలిచిపోయిన హంద్రీనీవా సుజల స్రవంతి పనులు కూడా ఇటీవలే ప్రారంభించామని గుర్తు చేశారు. 80 వేల కోట్లతో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రమంతా సస్యశ్యామలమవుతుందన్నారు.

## శ్రీరామ్‌కు అభినందనలు

రైతు బడి-అగ్రి షో కార్యక్రమం పేరుతో వ్యవసాయంలో సాంకేతిక పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న టీడీపీ నాయకుడు పరిటాల శ్రీరామ్ ను మంత్రి సవిత అభినందించారు. యువత వ్యవసాయంలోకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇందుకు పరిటాల శ్రీరామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖాధికారులు, వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు సదస్సులో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి సవిత సందర్శించారు. డ్రోన్లు, ట్రాక్టర్లను పరిశీలించారు. అధిక దిగుబడులిచ్చే టమాటా నారును,






మామిడి, ఇతర మొక్కలను తిలకించారు.

## రైతు ద్రోహి జగన్

కార్యక్రమంలో అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ, జగన్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. టీడీపీ ప్రభుత్వాల హయాంలోనూ, 2019-24 మధ్య కాలంలోనూ వ్యవసాయ అభివృద్ధికి తీసుకున్న చర్యలపై చర్చకు రావాలని జగన్ కు మంత్రి సవిత సవాల్ విసిరారు. రైతు ద్రోహి అని జగన్ తీవ్రంగా విమర్శించారు. జగన్ 5 ఏళ్ల పాలన రైతుతో పాటు సాగు రంగం కూడా కుదేలైందన్నారు. చంద్రబాబు ఉచితంగా జిప్సం, బోరాన్, జింక్ ఇస్తే...జగన్ వాటిని నిలిపేశాడన్నారు.

పురుగుల మందులు, కలుపు మందులు, గడ్డి మందులను చంద్రబాబు రైతుకు 50 శాతం సబ్సిడీపై ఇస్తే...జగన్ వాటిని కూడా నిలిపేశాడన్నారు. చంద్రబాబు హయాంలో మైక్రో ఇరిగేషన్ పరికరాలను 90 శాతం సబ్సిడీతో రైతులకు ఇవ్వగా....వాటిని ఇవ్వకుండా జగన్ చేతులు ఎత్తేశాడన్నారు. మిర్చి పంటపైనా జగన్ దొంగ నాటకం ఆడుతున్నాడని మండిపడ్డారు.

ఎన్నికల కోడ్ ఉంటుండగా గుంటూరు మిర్చి యార్డుకు ఎలా వెళతారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ రైతులను, ప్రజలను పట్టించుకోని జగన్.. ఇప్పుడు ఆకస్మాత్తుగా సవిత ప్రేమ కురిపిస్తూ దొంగ నాటకమాడుతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
4
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 23, ఫిబ్రవరి 2025 ||

## ఏపీ ఫైబర్ నెట్‌లో రూ.121 కోట్ల స్కాం

- ఈ అవినీతికి చంద్రబాబే కారణమని తేల్చిన సీఐడీ
- ఇప్పటికే ఈ కేసులో చంద్రబాబు ముద్దాయి
- సీఎంగా ఈ కేసు నుంచి బయటపడేందుకు చంద్రబాబు యత్నం
- ఏకంగా ఏపీ ఫైబర్ నెట్ ను నిర్వీర్యం చేసే కుట్ర
- తాడేపల్లి వైయస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఏపీ ఫైబర్ నెట్ కార్పోరేషన్ మాజీ చైర్మన్, వైయస్ఆర్ టియుసి అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి



**తాడేపల్లి:** ఏపీ ఫైబర్ నెట్ కార్పోరేషన్ ద్వారా గతంలో రూ.121 కోట్ల అవినీతికి పాల్పడిన కేసులో ముద్దాయిగా ఉన్న చంద్రబాబు నేడు అధికారాన్ని ఉపయోగించుకుని ఈ కేసు నుంచి బయటపడేందుకు కుట్ర చేస్తున్నారని ఏపీ ఫైబర్ నెట్ మాజీ చైర్మన్, వైయస్ఆర్ టియుసి అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాడేపల్లిలోని వైయస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే ఈ కేసులో సీఐడీ అన్ని ఆధారాలతో చంద్రబాబుపై కేసులు నమోదు చేసిందని, దీని నుంచి తప్పించుకునేందుకు ఇప్పుడు ఏపీ ఫైబర్ నెట్ నే రద్దు చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ కేసులో వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చిన ఐపీఎస్ అధికారులను తమ స్టేట్ మెంట్లను మార్చి చెప్పాలని ప్రభుత్వం బెదిరిస్తోందని అన్నారు.

2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం ఏపీ ఫైబర్‌నెట్ కార్పోరేషన్ ను ప్రారంభించింది. ఈ సంస్థను అడ్డం పెట్టుకుని చంద్రబాబు రూ.121 కోట్ల అవినీతికి పాల్పడ్డారు. వైయస్ఆర్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఏపీ ఫైబర్ నెట్ లో జరిగిన అవినీతి బయటపడింది. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో సీఐడీ ఆనాడు చంద్రబాబు ప్రభుత్వం చేసిన అక్రమాలు, అవినీతి వ్యవహారాలను ఆధారాలతో సహా బయటపెట్టింది. ఇప్పటికే ఏపీ ఫైబర్ నెట్ అవినీతి వ్యవహారంలో చంద్రబాబుపై కేసు నమోదయ్యింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడి, చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఈ కేసుల నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

ఇందుకోసం ఏకంగా ఏపీ ఫైబర్ నెట్ కార్పోరేషన్ నే మూసేసేందుకు కుట్ర జరుగుతోంది. ఏపీ ఫైబర్ నెట్ స్కామ్‌లో నిండా కూరుకుపోయిన సీఎం చంద్రబాబు, ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రావడంతో, దాన్నుంచి బయట పడేందుకు యథేచ్ఛగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడు. అందుకోసం ఎంతకైనా తెగించేందుకు చంద్రబాబు వెనుకాడడం లేదు. గతంలో ఈ కేసులో తమ స్టేట్‌మెంట్ లను ఇచ్చిన ఐఏఎస్ అధికారులను బెదిరించడం, భయపెట్టడం ద్వారా, వారు తమ స్టేట్‌మెంట్ లను మార్చి చెప్పేలా వత్తిడి చేస్తున్నారు. ప్రయత్నం చేస్తున్నారు.

ఏపీ ఫైబర్ నెట్‌లో జరిగిన అవినీతి క్రమం ఇది...

2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు తన సన్నిహితుడు వేమూరి హరికృష్ణ ప్రసాద్ ద్వారా ఏపీ ఫైబర్ నెట్ కార్పోరేషన్ లో భారీ అవినీతికి పాల్పడ్డారు. రూ.333 కోట్ల మేరకు ఆనాటి ప్రభుత్వం ఏపీ ఫైబర్ నెట్ ద్వారా టెండర్లు పిలిచింది. దీనిలో మొత్తం రూ.321 కోట్ల మేర అవకతవకలు జరగగా, తరువాత అధికారంలోకి వచ్చిన వైయస్ఆర్సీపీ ప్రభుత్వ ఆదేశాలతో సీఐడీ విచారణ చేపట్టింది. ఈ విచారణలో రూ.121 కోట్లకు సంబంధించిన అవినీతికి పక్కాగా ఆధారాలు దొరికాయి.

ఈ అక్రమాలకు కారణమైన టెర్రాసాఫ్ట్ సంస్థ గతంలో టెండర్ ప్రక్రియ లోపభూయిష్టం, పని చేయకపోయినా చేసినట్లు చూపడం, బిల్లులు తీసుకోవడం, నాసిరకం పరికరాల వినియోగం వంటి అవకతవకలకు పాల్పడటం వల్ల సదరు సంస్థను రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. అయితే ఆ సంస్థలో కీలక స్థానంలో పనిచేస్తున్న వేమూరి హరికృష్ణ ప్రసాద్ సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు కావడంతో ఈ సంస్థను అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడేందుకు ప్రణాళికను సిద్దం చేశారు. దీనిలో భాగంగా నిబంధనలకు విరుద్దంగా టెర్రా సాఫ్ట్ కంపెనీపై విధించిన నిషేదంను తెలుగుదేశం ప్రభుత్వం ఏకపక్షంగా తొలగించింది.

2015, మే 11న టెర్రాసాఫ్ట్ ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టగా, అదే ఏడాది ఆగస్టు 6న ఆ నిషేధం ఎత్తివేశారు. ఆ మర్నాడే ఏపీ ఫైబర్ నెట్ టెండర్లు పిలిచారు. ఈ టెండర్లకు ముందే ప్రభుత్వం బ్లాక్ లిస్ట్ లో పెట్టిన టెర్రాసాఫ్ట్ కంపెనీలో కీలక స్థానంలో పనిచేసిన వేమూరి హరికృష్ణ ప్రసాద్ ను ఆ సంస్థ నుంచి రాజీనామా చేయించి, ఏపీ ఫైబర్ నెట్ కార్పోరేషన్ లో డైరెక్టర్ గా నియమించారు. ఇదే వేమూరి హరికృష్ణ ప్రసాద్‌పై గతంలో హైదరాబాద్‌లో శిక్ష పడింది.

ఈవీఎంల ట్యాంపరింగ్ చేశాడని ముంబైలో కేసు నమోదైంది. అటువంటి వ్యక్తి ద్వారా ఏపీ ఫైబర్ నెట్ టెండర్లు టెర్రాసాఫ్ట్ కు కట్టబెట్టారు. ఈ మొత్తం ప్రక్రియలో వేమూరి హరికృష్ణ ప్రసాద్ కీలకంగా వ్యవహరించారు.

దొంగ చేతికే తాళం ఇచ్చిన చందంగా వేమూరి హరికృష్ణ ను అడ్డం పెట్టుకుని చంద్రబాబు చేసిన అ అవినీతి కుంబకోణం వైయస్ఆర్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సీఐడీ విచారణలో ఈ వాస్తవాలు బయటపడ్డాయి.

## బీసి జనగణనను ఏ సర్వేతోనూ పోల్చలేరు

- కాంగ్రెస్ పార్టీ ద్వారానే సామాజిక న్యాయం జరుగుతుందని ప్రతి ఇంటికి ప్రచారం చేయండి
- ప్రజా భవన్‌లో బిసి నేతల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్:** ఈ దేశంలో ఇప్పటివరకు బీసీ జన గణన సైంటిఫిక్ గా తేల్చలేదు. మొదటిసారి తేల్చింది తెలంగాణ ప్రభుత్వమే. రాష్ట్ర ప్రభుత్వం చేసిన బీసి జనగణనను ఏ సర్వే తోనూ పోల్చలేరు. 2011లో జరిగిన జన గణన లో కేవలం ఎస్సీ, ఎస్టీ, ఇతర జనాభా లెక్కలే తేల్చారు.

కెసిఆర్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే అధికారికం కాదు. దానిని క్యాబినెట్ లో పెట్టలేదు, శాసనసభలో చర్చకు పెట్టలేదు. కాబట్టి అది చెల్లుబాటు కాదు. దేశంలో మొదటిసారి బీసీ జనాభాను అధికారికంగా లెక్క తేల్చి ముద్ర వేశాం. దీనిని ఆయా వర్గాల ప్రయోజనం కోసం ఎలా ముందుకు తీసుకువెళ్లాలనేది బీసీ ప్రజా ప్రతినిధులు, సంఘాలు ఆలోచన చేయాలి.

బీసీ సర్వే అధికారికంగా జరగడం మూలంగా టిఆర్ఎస్ కు నష్టం. కాబట్టి సర్వే బాగాలేదని ప్రచారం చేసి బీసీ లబ్ధిదారులకు ప్రయోజనం దక్కకుండా ఆ పార్టీ రాజకీయం చేస్తుంది. తెలంగాణలో బీసీ సర్వే విజయవంతం అయితే దేశవ్యాప్తంగా చేయాల్సి వస్తుంది. బీజేపీ పై ఒత్తిడి పెరుగుతుందని ఆ పార్టీ నేతలు సర్వేపై దుష్ప్రచారం చేస్తున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి పై ఒత్తిడి ఉన్నప్పటికీ. రాహుల్ గాంధీ నా నాయకుడు ఆయన ఏ జెండానే నా ఎజెండా. నాకు వచ్చిన ఉద్యోగాన్ని సామాజిక న్యాయం చేయడానికి ఉపయోగిస్తా అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. వారికి నా అభినందనలు. సర్వే పారదర్శకంగా జరగాలని, ఈ అంశాన్ని సీరియస్గా తీసుకోవాలని, ఎక్కడ రాజీ పడవద్దని ప్రణాళిక శాఖ చూస్తున్న నాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారు.

సర్వేపై ఎవరు ఏ ప్రశ్న అడిగినా అధికారికంగా సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అన్ని ఆధారాలు అధికారికంగా నిక్షిప్తం చేశాం. 8 కోట్ల పేజీలకు పైబడిన సమాచారం సర్వే ద్వారా సేకరించాం.

## మున్నూరు కాపులను అణచివేసేందుకు రేవంత్ కుట్ర

- అందుకే సంఖ్య తగ్గించి చూపిస్తున్నారు
- మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్ నెలలో మున్నూరుకాపుల భారీ బహిరంగసభ
- ఎంపీ వద్దిరాజు

**హైదరాబాద్:** కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీలకు తీరని అన్యాయం చేస్తున్నాయని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించి 80ఏండ్లు సమీపిస్తున్నా కూడా బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, చట్టసభలలో రిజర్వేషన్స్ లేకపోవడం తీవ్ర బాధాకరమన్నారు. హైద రాబాద్ మియాపూర్ సత్యభారతి కన్వెన్షన్ హాలులో శనివారం జరిగిన మున్నూరుకాపు, కాపు ప్రతినిధుల సమావేశానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

బీసీలు తమ న్యాయమైన హక్కుల సాధనకు,రాజ్యాధికారంలో జనాభా దామాషా ప్రకారం వాటా దక్కించుకునేందుకు సమరశీల పోరా టాలకు సిద్ధమవ్వాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉండి కూడా అన్ని రంగాలలో అన్యాయానికి గురి కావడం శోచనీయమన్నారు.

పదేళ్ల కాలంలో జనాభా 13.5% పెరుగుతుందని,ఆ లెక్కన చూస్తే తెలంగాణ జనాభా 4 కోట్ల 30 లక్షలు ఉంటుందని ఎంపీ వద్దిరాజు తెలిపారు.అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం జరిపించిన సర్వేలో 3 కోట్ల 70 లక్షలు మాత్రమే చూపించడం క్షమించరాని తప్పు అని ఆయన మండిపడ్డారు.రాష్ట్రం మొత్తం జనాభాను, మున్నూరుకాపులతో పాటు బీసీలలోని అన్ని కులాల జన సంఖ్యను తక్కువ చేసి చూపి అణచివేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ విషయంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లు వెంటనే స్పందించి బీసీల పక్షాన గట్టిగా నిలబడి ముఖ్యమంత్రిని నిలదీయాలని, లేనిపక్షంలో భవిష్యత్ తరాలు క్షమించవని స్పష్టం చేశారు.

రీసర్వేను 3.1% మాత్రానికే పరిమితం చేయకుండా,ప్రజలందరిని భాగస్వాములను చేయాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు. ఇందుకోసం పీసీసీ అధ్యక్షుడు మహేష్,మంత్రి పొన్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వత్తిడి పెంచాల్సిందిగా సలహా ఇచ్చారు.ఏపీలో పవన్ కళ్యాణ్ ప్రబల రాజకీయ శక్తిగా ఎదిగారని,మన రాష్ట్రంలో కూడా గణనీయమైన సంఖ్యలో ఉన్న మున్నూరుకాపులం బీసీలలోని ఇతర కులాల వారితో స్నేహపూర్వకంగా ముందుకు సాగుతూ రాజ్యాధికారం




వైపు అడుగులేద్దామని ఎంపీ రవిచంద్ర పిలుపునిచ్చారు.

అవసరమైన ప్రతి సందర్భంలో మనం సంఘటిత శక్తిని ప్రదర్శించాలని,ఐకమత్యమే బలం అని గుర్తు చేసుకుంటూ ముందుకు సాగుదామన్నారు.చట్టసభలలో 33%, స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్స్, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ సాధనకు,బోగస్ సర్వే నివేదికను తిప్పికొడుతూ, మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్ నెలలో మున్నూరుకాపుల భారీ బహిరంగసభ జరుగుతుందని ఎంపీ వద్దిరాజు తెలిపారు.

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, ప్రముఖ జర్నలిస్ట్ చందు జనార్ధన్, ఐఆర్ఏస్ రిటైర్డ్ అధికారి మంగబాబు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య తదితర ప్రముఖుల ఆధ్వర్యాన ఏర్పాటైన ఈ సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు ప్రసంగించారు.

## మార్కెట్‌ను బట్టి రైతులకు గిట్టుబాటు ధర

- 24 గంటల్లోపే ధాన్యం నగదు చెల్లింపులు
- గత ప్రభుత్వ బకాయిలు రూ.361 కోట్లను మిల్లర్లకు చెల్లించాం
- మిల్లర్లు బాధ్యతగా వ్యవహరించకపోతే ఊరుకోం..కేసులు నమోదుచేస్తాం
- నూటికి నూరుశాతం రైతుల పక్షాల నిలబడతాం
- నెల్లూరు జిల్లాలో గత ప్రభుత్వం చెల్లించాల్సిన రవాణా, హమాలీ చార్జీలను రెండురోజుల్లో చెల్లిస్తాం
- రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డితో కలిసి సంగంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు



**నెల్లూరు/సంగం:** రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో నిజాయితీగా పనిచేస్తోందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం ఉదయం సంగం మండలంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి మంత్రి నాదెండ్ల పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సంగం మండల కేంద్రంలో 20.50 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం, గోదాములు, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల ప్రారంభించారు.

ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ .. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమన్నారు. ప్రతి విషయంలోనూ రైతులకు మంచి చేసేందుకు నిజాయితీగా పనిచేస్తున్నట్లు చెప్పారు. రైతులకి మార్కెట్‌ని బట్టి మద్దతు ధర అందించేలా కృషి చేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ లో 33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగులు చేసి 5.87 లక్షల మంది రైతులకు 24 గంటల్లో 7480 కోట్ల రూపాయలు జమచేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో నెల్లూరు జిల్లాలో 32కోట్ల రూపాయల రైతుల సొమ్మును స్కామ్ చేసి దోచేశారన్నారు.

గత ప్రభుత్వ పాలకులు వ్యవస్థలను దుర్వినియోగం చేసి రైతులను మోసం చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం మిల్లర్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ.361 కోట్లను తమ ప్రభుత్వం చెల్లించిందన్నారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి మిల్లర్లకు రూ. 10 కోట్లు చెల్లించామన్నారు. అలాగే రైతులకు సంబంధించి గత ప్రభుత్వం ధాన్యం సేకరించి డబ్బులు చెల్లించ కుండా, 1674 కోట్లు బకాయి పెట్టిందని, తమ ప్రభుత్వం ఆ బకాయిలను రైతులకు చెల్లించిందని చెప్పారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి గత ప్రభుత్వం బకాయి పెట్టిన రవాణా, హమాలి చార్జీలు రూ. 1.40 కోట్లు రెండు రోజుల్లో రైతుల ఖాతాలో జమ చేస్తామని చెప్పారు.

ధాన్యం కొనుగోలుకు సంబంధించి గత ఏడాది కంటే ఈ ఏడాది నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా కొనుగోలు చేసి 24 గంటల్లోపే డబ్బులు చెల్లించామని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతాంగానికి అన్నివిధాలా అండగా నిలుస్తామన్నారు. రైసుమిల్లుల యజమానులు బాధ్యతగా పనిచేయాలని, రైతుల్ని ఇబ్బంది పెడితే సహించమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మధ్యాహ్న భోజనపథకానికి వచ్చే విద్యాసంవత్సరం నుంచి సన్నబియ్యాన్ని సరఫరా చేయబోతున్నట్లు చెప్పారు. రైతులు భయాందోళనకు గురయ్యేలా కొంతమంది అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వీటిని నమ్మవద్దన్నారు.

నూటికి నూరుశాతం రైతుల పక్షాల పనిచేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని మంత్రి చెప్పారు. నెల్లూరు జిల్లాలో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మార్చి నెల ఒకటో తేదీ నుంచి జిల్లాలో సుమారు 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తుండగా, 25 లక్షల ధాన్యాన్ని పిడిఎస్ బియ్యానికి వినియోగిస్తున్నట్లు చెప్పారు.

గత ప్రభుత్వంలో మూడు వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వారందరికీ కూడా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున 1871 మందికి ఆర్థిక సహాయం అందించారని చెప్పారు. తేమశాతం 17 కంటే ఎక్కువగా ఉంటే ఒక కేజీ నుంచి ఐదు కేజీల వరకు మాత్రమే ధాన్యం తీసుకోవాలని, అంతకు మించితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని రైస్ మిల్లర్లను హెచ్చరించారు.




## రేవంత్ సీఎం అయ్యాక ఒక్క ఎకరాకు అయినా నీళ్లు ఇచ్చారా?

- ప్రజలకు ఈ తిట్లతో ఏమైనా మేలు జరుగుతుందా?
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్:** పదేపదే వక్రీకరిస్తే చరిత్ర మారిపోదు. వాస్తవం వాస్తవం లాగానే ఉంటుంది. వాస్తవానికి విరుద్ధంగా సీఎం మాట్లాడుతున్నారు. ప్రజలు రేవంత్ ను అసహ్యించుకుంటున్నారు. సీఎం కేసీఆర్ హయంలో పూర్తయిన భవనాలను రేవంత్ ప్రారంభించారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి చేయాల్సిన ప్రారంభాలను సీఎం చేస్తున్నారు. పది నెలలుగా పని చేస్తున్న పోలీస్ స్టేషన్ ను సీఎం ప్రారంభించారు. ఇలాంటి అభివృద్ధి మోడల్‌తో వెళ్తున్న సీఎం రేవంత్ మమ్మల్ని చర్చకు రమ్మంటున్నారు. ఇలాంటి సీఎం తో ఏం చర్చచేస్తారు ? అంతా కేసీఆర్ విధ్వంసం చేశారని తప్పుడు మాటలు అన్నారు. లక్షల ఎకరాల పంట కళ్ల ముందు ఉంది. కేసీఆర్ నీళ్లు ఇవ్వలేదంటున్నారు. రేవంత్ సీఎం అయ్యాక ఒక్క ఎకరాకు అయినా నీళ్లు ఇచ్చారా? పాలమూరు బిడ్డను కనుక తనను కాపాడుకోవాలని రేవంత్ అంటున్నారు. ఎందుకు కాపాడుకోవాలి రేవంత్ ను? పాలమూరు బిడ్డ లకు రైతు బంధు ,రైతు భరోసా ఇవ్వనందుకా ? పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ను అడ్డంకులమధ్య కేసీఆర్ రాష్ట్ర సొంత నిధులతో దాదాపుగా పూర్తి చేశారు. పన్నెండు వందల కోట్ల రూపాయలతో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయొచ్చు. ..అయినా పది నెలలుగా రేవంత్ ఏం చేస్తున్నారు? పన్నెండు లక్షల ఎకరాల కు నీళ్లిచ్చే ప్రాజెక్టు ను రేవంత్ నిర్లక్ష్యం చేశారు.

ఉద్దండ పూర్ ద్వారా గ్రావిటీ కాలువ ద్వారా కొడంగల్ కు నీళ్లు ఇవ్వొచ్చు ..అయినా కొడంగల్ నారాయణ్ పేట లిఫ్ట్ తెచ్చారు. కళ్ళ ముందు ప్రాజెక్టులు కనిపిస్తుంటే కేసీఆర్ ఏం చేయలేదంటే ఎట్లా ? అరుపులు పెడ బొబ్బలతో కేసీఆర్ చేసిన అభివృద్ధి ని రూపుమాపుతావా ? ఎక్కడికి వెళ్లినా సీఎం అని మరచి రేవంత్ కేసీఆర్ పై ఇష్టానుసారంగా తిట్ల పురాణం అందుకుంటున్నారు. ప్రజలకు ఈ తిట్లతో ఏమైనా మేలు జరుగుతుందా ? పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయడానికి రేవంత్ కు ఎందుకు కడుపు నొప్పి ?

కేసీఆర్ కు నీ మీద కక్ష ఎందుకు ఉంటుంది? కేసీఆర్ ది విలక్షణ మనస్తత్వం. తన మీద పోటీ చేసిన ప్రత్యర్థులను అక్కున చేర్చుకున్న మనస్తత్వం కేసీఆర్ ది. కేసీఆర్‌ను ఎందరో తిట్టారు. వారి మీద కక్ష కట్టారు. కేసీఆర్ పదేళ్ల పాలనపై విమర్శలు చేస్తే ఏం లాభం ఉండదు. కేసీఆర్ కట్టిన పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి పాలన చేస్తూ కేసీఆర్ ను విమర్శిస్తున్నారు. .ప్రజలు నవ్వుకుంటున్నారు. కేసీఆర్ కట్టిన వాటిని ప్రారంభం చేస్తూ కేసీఆర్ ను తిడితే ఎలా ?రేవంత్ నీ పాలనలో చేసిందేమిటో చెప్పు ?

కులగణన బ్రిటిష్ హయంలో 1931లో చేశారు తర్వాత చేయలేదని తానే చేశాను అన్నట్టుగా రేవంత్ మాట్లాడుతున్నారు. 1952 నుంచి చాలా యేండ్లు కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నాయి వేరే రాష్ట్రాలు కూడా కులగణన చేశాయి. వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ వ్యాఖ్యలు మరీ విడ్డూరంగా ఉన్నాయి. పంటలకు నీళ్లివ్వలేమని చెప్పేందుకేనా కోదండరెడ్డికి కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చింది ? ఆ పదవి వదులుకుని కోదండరెడ్డి కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి తీసుకుంటే మంచిది.

## జిల్లాలో 30లక్షల గోతాలు అందిస్తాం

- తేమ శాతం నిర్ధారించేందుకు ఒకే కంపెనీ మిషన్లు
- క్షేత్రస్థాయిలో అధికార యంత్రాగం అందుబాటులో ఉంటుంది
- అక్రమాలకు పాల్పడే మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం :
- రైతుల ముఖాముఖీలో మంత్రి నాదెండ్ల

**నెల్లూరు / సంగం:** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఇబ్బందులు లేకుండా 30 లక్షల గోతాలను అందిస్తామవి రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సంగంలో రైతులతో ముఖాముఖిగా మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సమస్యలను రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు ప్రభుత్వం చెప్పినవిధంగా జరగడం లేదన్నారు.

మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని, తేమశాతం పేరుతో ఎక్కువ కిలోల తరుగు తీసుకుంటున్నారని చెప్పారు. గోతాలు అందుబాటులో వుండడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తేమ శాతం నిర్ధారించి, ఆ శాతానికే మిల్లర్లు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో స్లిప్పు ఇచ్చిన తరువాత మిల్లర్లను బతిమిలాడే పరిస్థితి లేకుండా చేయాలన్నారు. వ్యవసాయ ఖర్చులు కూడా బాగా పెరిగిపోయాయని, గిట్టుబాటు ధర పెంచాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులకు అండగా నిలవాలన్నారు. రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి నాదెండ్ల పలు సమస్యలకు పరిష్కారం చూపేలా చర్యలు చేపడ్తామన్నారు. తేమ శాతాన్ని నిర్ధారించేందుకు ఒకే కంపెనీ మిషన్లు అందుబాటులో తీసుకొస్తామన్నారు. ప్రతి మండలానికి కూడా ఒక డ్రయర్ అందించేందుకు, ఉపాధి హామీ నిధులతో ప్రభుత్వ భూముల్లో సిమెంట్ కల్లాలు ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. 50% సబ్సిడీతో టార్పాలిన్ పట్టలను రైతులు అందిస్తామని చెప్పారు. కౌలు రైతులకు మేలు జరిగేలా కౌలు రైతు చట్టంలో మార్పులు చేస్తూ రైతు భరోసా వచ్చేలా నూతన చట్టాన్ని తీసుకొస్తామని మంత్రి చెప్పారు.

### పట్టుదల, నిజాయితీ గల నేత
### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి : నాదెండ్ల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004వ సంవత్సరంలో తాను శాసనసభ్యుడిగా వున్నప్పటి నుంచే ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, గారితో మంచి అనుబంధం వుందని, తనను సొంత కుటుంబసభ్యుడిగా చూసుకుంటూ రాజకీయంగా తనను ఆనం కుటుంబం ముందుండి నడిపించిందని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఆత్మకూరు అభివృద్ధికి ఆనం రామనారాయణరెడ్డి పట్టుదలతో, నిజాయితీతో పనిచేస్తున్నారని, వందల కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తున్నారని చెప్పారు. కుటుంబ నేపథ్యం వున్నప్పటికీ అంకితభావంతో పనిచేయడంతోనే ఇవన్నీ సాధ్యమని నాదెండ్ల అన్నారు.

### గత ప్రభుత్వంలో రైతుల బాధలు వర్ణణాతీతం: ఆనం

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



మాట్లాడుతూ.. ఆత్మకూరుతో మంత్రి నాదెండ్ల మనోహర్‌కు మంచి అనుబంధం వుందన్నారు. 1983లో నాదెండ్ల మనోహర్ తండ్రి నాదెండ్ల భాస్కర్‌రావు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రిగా ఈ ప్రాంతంలో ఆనాటి ఎమ్మెల్యే ఆనం వెంకటరెడ్డి హయాంలో ఆత్మకూరులో తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారని, ఇప్పుడు తాను మంత్రిగా, ఎమ్మెల్యేగా వుండడం, మంత్రిగా నాదెండ్ల మనోహర్ తన నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా వుందన్నారు.

సంగం రోడ్డు కం బ్యారేజ్‌ని నిర్మించేందుకు తాను ఆర్థికమంత్రిగా 130కోట్ల రూపాయలను మంజూరు చేస్తే కేవలం సంగం బ్యారేజ్‌ను మాత్రమే పూర్తి చేసి రోడ్డును నిర్మించలేదన్నారు. ఈ రోడ్డును పూర్తి చేసి జాతీయ రహదారికి అనుసంధానం చేయాల్సి వుందన్నారు. సీఎం తో కూడా ఈ విషయమై చర్చించినట్లు చెప్పారు.

### రైతుల ప్రయోజనాలే ఎన్‌డిఎ ప్రభుత్వ లక్ష్యం : ఎంపీ వేమిరెడ్డి

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో వరిపంట వేశారని, 11మిలియన్ టన్నుల ధాన్యం పండే అవకాశం వుందన్నారు. ఈ ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు జిల్లాలో వ్యవసాయ గోడౌన్‌లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 78 సహకార సంఘాలు వున్నాయని, వీటి పరిధిలో దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం విక్రయించుకునేందుకు జిల్లాలో 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతుకు మంచి గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం దృఢసంకల్పంతో పనిచేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవో పావని, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డిసివో గుర్రప్ప, ఎన్‌డిసిసి బ్యాంకు సిఇవో శ్రీనివాసరావు, సంగం పిఎసిఎస్ చైర్మన్ కట్టా సుబ్రహ్మణ్యం, సిఇవో దస్తగిరి అహ్మద్, తహశీల్దార్ సోమ్లానాయక్, సర్పంచ్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 23, ఫిబ్రవరి 2025



## ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

◆ ఎమ్మెల్యే ఆనందబాబు

**తెనాలి, మహానాడు:** గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, గుంటూరు వారి ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సమావేశం తెనాలిలోని నూకల రామకోటేశ్వర రావు కల్యాణ మండపంలో జరిగింది. మాజీ మంత్రి, వేమూరు శాసన సభ్యుడు నక్కా ఆనందబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈనెల 27వ తేదీన జరగబోవు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారందరు ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి మొదటి 1 ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.





## ద్వారపూడిలో అతిపెద్ద ఆదియోగి విగ్రహం

**రాజమండ్రి:** తూర్పుగోదావరి జిల్లాలో రాజమండ్రికి అత్యంత సమీపంలో ఉన్న ద్వారపూడిలో "ఆదియోగి" విగ్రహం నిర్మించారు. 60 అడుగులు ఎత్తు, 100 అడువుల వెడల్పులో"ఆదియోగి" విగ్రహం నిర్మించారు. ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ విగ్రహాన్ని ప్రారంభించనున్నారు.

## యూట్యూబ్ ఛానల్ ముసుగులో స్పా!

- అదుపులో 10 మంది మహిళలు
- 13 మంది విటులు ● పరారీలో నిందితుడు

**విజయవాడ:** విజయవాడలో యూట్యూబ్ ఛానల్ ముసుగులో స్పా సెంటర్ నడుపుతున్నట్టు పోలీసులు పసిగట్టారు. వెటర్నరీ కాలనీ సర్వీస్ రోడ్డులో గల స్టూడియో 9, (స్పా)పై సిబ్బందితో కలిసి మాచవరం సీఐ ప్రకాష్ దాడులు చేశారు. దీంతో గుట్టు రట్టయింది. ఏపీ 23 యూట్యూబ్ ఛానల్ న్యూస్ బిల్డింగ్ లో స్పా సెంటర్ నడుపుతున్నారని సమాచారం అందుకున్నారు. 10 మంది మహిళలు, 13 మంది విటులను అదుపులోకి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళలంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారుగా గుర్తించారు. చలసాని ప్రసన్న భార్గవ్ యూట్యూబ్ ఛానల్ ను అడ్డం పెట్టుకుని స్పా సెంటర్ ను నిర్వహిస్తున్నట్టు తెలుపారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధుడు, గొప్ప విద్యావేత్త మౌలాన అబుల్ కలాం ఆజాద్గా వర్ధంతి సందర్భంగా, ఆ మహనీయునికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఘన నివాళులు అర్పించారు.



## పట్టభద్రులంతా రాష్ట్ర అభివృద్ధికి పట్టం కట్టండి

- కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు పిలుపు

**కొవ్వూరు, మహానాడు:** కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్, సచివాలయం స్టాఫ్ ని శనివారం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గ్రాడ్యుయేట్లు అంతా కూటమి అభ్యర్థి అయిన పేరాభత్తుల రాజశేఖరంకి తొలి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.



ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టా భద్రుల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు పట్టభద్రులు అండగా ఉండాలని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, ఏ పి ఎస్ ఆర్ టి సి చైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు పెడన పట్టణం కూటమి నాయకులు కోరారు.



21వ జాతీయ జంప్ రోప్ క్రీడల ఛాంపియన్షిప్ నందు నేషనల్ లెవెల్ మొదట, రెండవ స్థానాలు కైవసం చేసుకున్న కొండూరు సన్నీ, షేక్ ఆయేషా సిద్దిక లకు ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అభినందనలు.

## సెకీ ఒప్పందంపై ఏపీఈఆర్సీ నివేదిక చంద్రబాబుకు చెంపపెట్టు

- చంద్రబాబు అబద్ధాల పుట్ట పగిలిపోయింది
- సెకీతో వైయస్ జగన్ ఒప్పందం వల్ల రాష్ట్రానికి రూ. 1.10 లక్షల కోట్ల సంపద సృష్టి
- చంద్రబాబు ఒప్పందం కారణంగా రూ. 87,500 కోట్ల సంపద ఆవిరి
- నెల్లూరు జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్

**నెల్లూరు:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీతో వైయస్ఆర్సీపీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు సక్రమమేనని ఏపీఈఆర్సీ స్పష్టం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని నెల్లూరు జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఒప్పందాలపై చంద్రబాబుకు వంతపాడే ఎల్లో మీడియా ఈనాడు, ఆంధ్రజ్యోతిలు దీనిపై గతంలో తాము రాసిన తప్పుడు వార్తలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాల కోసం ముందుచూపుతో సెకీతో ఆనాడు వైయస్ జగన్ తీసుకున్న నిర్ణయాల వల్ల రాష్ట్రానికి తక్కువ రేట్లకే విద్యుత్ లభించిందని అన్నారు.

సెకీ నుంచి 4 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుపై డిస్కంలకు ఏపీఈఆర్సీ అనుమతించింది. గతంలో వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో ఏపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం పారదర్శకంగా జరిగిందని దీనితో మరోసారి స్పష్టమైంది. రాష్ట్ర ప్రజలు, రైతుల విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆనాడు ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ సెకీ (సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో చేసుకున్న ఒప్పందాలన్నీ సరైనవేనని, కొనుగోలు ఒప్పందం అత్యంత పారదర్శకంగా జరిగిందని ఏపీఈఆర్సీ స్పష్టం చేసింది.

ఈ ఒప్పందం వెనుక అవినీతి జరిగిందంటూ అడ్డూఅదుపూ లేకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన చంద్రబాబు, ఎల్లో మీడియాకు ఇప్పుడు దీనిపై ఏం చెబుతాయని ప్రశ్నించారు. 2025-26లో సెకీ నుంచి 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను తీసుకోవడానికి ఏపీఈఆర్సీ డిస్కంలను అనుమతించడంతో ఇప్పటి వరకు ఈ ఒప్పందాలపై వైయస్ జగన్ మీద దుమ్మెత్తి పోసిన పచ్చ సైకోల నోర్లు మూతబడ్డాయి. జగన్ వ్యక్తిత్వం మీద మరక వేయాలని చూసిన వారు నవ్వులపాలయ్యారు.

వైయస్సార్సీపీ ప్రతిష్టని దెబ్బతీయాలని ఎల్లో మంద చేసిన



కుట్రలు బట్టబయలయ్యాయి. ఒక్కమాటలో చెప్పాలంటే చంద్రబాబు అబద్ధాల పుట్ట బద్ధలైంది. వైయస్ జగన్ చేసుకున్న ఒప్పందం కారణంగా ఇంటర్ ట్రాన్స్‌మిషన్ చార్జీల(ఐఎస్‌టీసీ) రూపంలో అదనపు భారం పడిందంటూ చేసిన ప్రచారాలన్నీ అబద్ధాలేనని తేలిపోయింది. యూనిట్ రూ. 2.49కే ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా రూ. 1.10 లక్షల కోట్లను ఆదా చేసినట్టు రుజువైంది.

కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం అని తెలిసినా, దళారులు లేరని తెలిసినా.. వైయస్ జగన్ లంచాలను తీసుకున్నారని, అమెరికాలో కేసు నమోదైందని, ఏపీలోనూ కేసు పెడతామని ఆరోజు తెలుగుదేశం పార్టీ నేతలు రెచ్చిపోయారు. దీనిపై పూర్తి వివరాలతో మా నాయకుడు వైయస్ జగన్ వెంటనే స్పష్టత ఇచ్చారు. ఈ రోజు వైయస్ జగన్ గారు చెప్పినవి నిజమేనని, అత్యంత పారదర్శకంగానే ఈ ఒప్పందాలు జరిగాయంటూ ఏపీఈఆర్సీ కూడా తేల్చి చెప్పింది.

ఏపీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా యూనిట్ రూ. 2.49లతో ఒప్పందం చేసుకుంటే, ఎక్కడ జగన్ కి మంచి పేరొస్తుందనే భయంతో బురదజల్లే కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టాడు. జగన్ చేసుకున్న ఈ ఒప్పందం కారణంగా ఏటా రూ. 4 వేల కోట్ల చొప్పున 25 ఏళ్లలో రూ. 1.10 లక్షల కోట్లు రాష్ట్రానికి సంపద సృష్టి జరుగుతుంది. మార్కెట్ రేటు కన్నా ఎక్కువ ధరలకు చంద్రబాబు ఒప్పందాలు చేసుకోవడం వల్ల రాష్ట్రానికి ఏకంగా రూ. 87,500 కోట్లు నష్టం జరుగుతున్నా ఎల్లో మీడియా ప్రశ్నించదు.

మేలు చేసిన జగన్‌ని ప్రశ్నించడం, సంపద ఆవిరి చేసిన చంద్రబాబు గురించి గ్రేట్ అంటూ ప్రశంసిస్తూ ఎల్లో మీడియా తన వికృత స్వభావాన్ని చాటుకుంటోంది. వైయస్ జగన్ కి అదానీ లంచం రూ. 1750 కోట్లు, అంతర్జాతీయ స్థాయికి జగన్ అవినీతి, సెకీ విద్యుత్‌కి ఐఎస్‌టీఎస్ చార్జీలు కట్టాల్సిందే.., జగన్, అదానీ లంచాల కహానీ, ముడుపుల ముడి వీడింది.. అంటూ ఈనాడు నీతి బాహ్యమైన, నిరాధార రాతలు అనేకం రాసింది. ఇప్పుడు అవ్వన్నీ తప్పుడు రాతలేనని తేలిపోయాయి.

ఇటువంటి తప్పుడు రాతలు రాసిన ఈనాడు ఇప్పుడు ఏ బావిలో దూకుతుందో.. తప్పుడు రాతలు రాసిన ఈ పత్రికను ప్రజలే బజారులో తగలబెట్టే రోజులొస్తాయి. చంద్రబాబు చేతికి జగన్ జుట్టు అంటూ ఆంధ్రజ్యోతి రాసింది. అది ఈ జన్మలో జరగదు. ఆ పగటి కలల నుంచి రాధాకృష్ణ బయటకు రావాలి. రాధాకృష్ణ జుట్టు జగన్ చేతికి దొరక్కుండా చూసుకోవాలి. ఇకపైన రాసే ముందు ఒళ్లు దగ్గర పెట్టుకుంటే మంచిది.

రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం వలన వారికి ఏడాదికి రూ. 40 వేలు సాయం చేసినట్టవుతుంది. జగన్ తీసుకున్న ఈ ఒప్పందం అమలు కాకపోయుంటే రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల పంపుసెట్లు వాడుతున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిన వ్యక్తి చంద్రబాబు. వాస్తవాలను ప్రజలకు చూపించే దమ్ము ధైర్యం ఎల్లో మీడియాకు ఉందా అని సవాల్ విసురుతున్నా. 2014లో చంద్రబాబు అధికారంలోకి రాకముందు రూ. 29 వేల కోట్లు విద్యుత్ బకాయిలు ఉంటే, ఆయన దిగిపోయేనాటికి రూ. 86 వేల కోట్లకు పెంచారు.

ఇలాంటి వాస్తవాలు ఎల్లో మీడియాకి రాసే దమ్ముందా? కనీసం మేం చెప్పేది వాస్తవం కాదని చెప్పగలరా? కూటమి పాలన చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపునకు కృషి చేద్దాం

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ

**గుంటూరు, మహానాడు:** ఉమ్మడి కృష్ణా -గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గుంటూరులోని 5వ మండలం ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం స్కూల్‌లోని ఉపాధ్యాయులను శనివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 27వ తేదీన జరగబోవు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మొదటి (1) ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. జయప్రకాశ్ తోపాటు గుంటూరు జిల్లా అద్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు, జోనల్ ఇన్చార్జ్ తలుచింతల అనిల్, మండల అధ్యక్షురాలు గొర్ల నాగలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళల భద్రతపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు

- వైయస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి ఫైర్

**తాడేపల్లి:** అధికారంలోకి వచ్చిన 9 నెలలుగా మహిళల భద్రతను గాలి కొదిలేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం, వారిపై యాసిడ్ దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా స్పందించడం లేదని వైయస్సార్సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివ శంకర్ రెడ్డి ఆక్షేపించారు. జగన్‌కి పేరొస్తుందనే కుట్రతో విజయవంతంగా పని చేసిన దిశ యాప్‌ను నిర్వీర్యం చేసిన చంద్రబాబు, కొత్తగా సురక్షా యాప్ తీసుకొస్తామని చెప్పడం మహిళలను వంచించడమే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రయోగాలు ఆపేసి, గతంలో జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్న దిశ యాప్‌నే కొనసాగించాలని శివశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

వైయస్ జగన్ సీఎంగా ఉండగా మహిళల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారు. అందులో భాగంగానే మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం డిసెంబర్ 15, 2020న దిశ యాప్ రూపొందించారు. స్మార్ట్ ఫోన్లో ఇన్స్టాల్ చేసుకుని ఎలా ఉపయోగించా? మహిళల భద్రతకు యాప్ ఎలా పని చేస్తోందో వివరిస్తూ పోలీస్ శాఖతో కలిసి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు.

అనుకోని సంఘటన ఎదురైనప్పుడు మహిళలు తమను తాము రక్షించుకునేలా రూపొందించిన దిశ యాప్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే, లేదా స్మార్ట్ ఫోన్‌ను మూడుసార్లు ఊపినా సరే, వెంటనే పోలీసులకు సమాచారం అందే వ్యవస్థ ఏర్పాటు చేశారు. దాంతో బాధితులున్న ప్రదేశానికి జీపీఎస్ ద్వారా పోలీసులు నిమిషాల వ్యవధిలోనే చేరుకుని రక్షణ కల్పించే టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చారు. అందుకే దిశ యాప్ చాలా ఆదరణ పొందింది. గత ఏడాది ఎన్నికల నాటికి ఏకంగా 1.56 కోట్ల మంది దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం గమనార్హం.

కేవలం దిశ యాప్ రూపకల్పనతోనే సరిపెట్టకుండా ప్రత్యేకంగా 18 దిశ పోలీస్ స్టేషన్లు, 13 పోక్సో కోర్టులు, 12 మహిళా కోర్టులు కూడా గత ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. వీటితో పాటు సత్వర న్యాయసహాయం అందించేలా ప్రత్యేకంగా 19 మంది స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను కూడా నియమించడం జరిగింది.

వీటన్నింటికి తోడు, దిశ వ్యవస్థ మరింత సమర్థంగా పని చేసేలా పెట్రోలింగ్ కోసం మహిళా ఉద్యోగులకు 900 ద్విచక్ర వాహనాలు, రక్షణ సిబ్బందికి 163 బొలేరో వాహనాలు, నేర పరిశోధన వేగంగా జరిగేలా ప్రత్యేకంగా 18 క్రైం మేనేజ్‌మెంట్ వాహనాలు కూడా ఏర్పాటు చేశారు.

దిశ వ్యవస్థ పక్కాగా పని చేయడంతో, 3 కేసుల్లో మరణ శిక్ష పడింది. 86 కేసుల్లో దోషులను శిక్షించారు. 31,607 మందికి ఎస్ఓఎస్ ద్వారా రక్షణ కల్పించడం జరిగింది. నేరాల



రేటు 27శాతం తగ్గిపోయింది. దిశ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం 19 జాతీయ అవార్డులతో గౌరవించింది.

కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే, జగన్‌పై కోపంతో దిశ యాప్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారు. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు టీడీపీ, జనసేన నాయకులకు వంత పాడుతున్నారు. దీంతో రాష్ట్రంలో మహిళల భద్రత గాల్లో దీపంలా మారిపోయింది. ఈ 9 నెలల చంద్రబాబు పాలనలో ఎక్కడ చూసినా మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు, అత్యాచారాలు మామూలైపోయాయి. ప్రభుత్వ ఉదాసీన వైఖరితో నేరస్తులు పేట్రేగిపోతున్నారు.

సాక్షాత్తు డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో యువతిపై అత్యాచారం జరిగినా స్పందించిన పాపాన పోలేదు. సీఎం బావమరిది బాలకృష్ణ సొంత నియోజకవర్గం హిందూపురంలో అత్తాకోడళ్ల మీద అత్యాచారం జరిగింది. రాష్ట్రంలో రోజుకు సగటున 48 మంది మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వమే సమాధానం ఇచ్చిందంటే, పరిస్థితి ఎంత ఘోరంగా తయారైందో, మహిళల రక్షణపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. ఆఖరుకి రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో లేవని సాక్షాత్తు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా అంగీకరించాడు.

9 నెలల తర్వాత, వందల మంది మహిళలు, విద్యార్థినిలను బలి తీసుకుని సురక్షా యాప్ తీసుకొస్తామని హోం మంత్రి అనిత చెబుతున్నారు. గత ప్రభుత్వంలో విజయవంతంగా పనిచేసిన దిశ యాప్ను నిర్వీర్యం చేసి 9 నెలల తర్వాత సావధానంగా సురక్షా యాప్ను తీసుకొస్తామంటున్న ఈ ప్రభుత్వాన్ని ఏమనాలి? అని పుత్తా శివశంకర్‌రెడ్డి నిలదీశారు.



## చేతకాక చేతులెత్తేస్తారా?

- రైతులను బోర్లు వేసుకోవద్దన్న ఉచిత సలహా దారుణం
- రేవంత్ అసమర్ధ పాలనకు కోదండ వ్యాఖ్యలే నిదర్శనం
- కోదండరెడ్డి వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్:** కోదండరెడ్డి గారు..ఇది కాలం తెచ్చిన కరువు కాదు. ముందుచూపు లేని ముఖ్యమంత్రి. చేతకానితనం వల్ల వచ్చిన కరువు. అసమర్థ కాంగ్రెస్ సర్కారు తెచ్చిన కరువు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును ఏడాదికాలంగా ఎండబెట్టి, రిజర్వాయర్లు పండబెట్టడం వల్లే రాష్ట్రంలో భూగర్భజలాలు అడుగంటిపోయాయన్నది వాస్తవం. పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెరువులు, కుంటలు నిండుకుండలను తలపించేలా నిర్వహణ చేయడం వల్లే తెలంగాణ వ్యాప్తంగా ఏనాడూ భూగర్భజలాలు పడిపోలేదు. కానీ కాంగ్రెస్ సర్కారు చేతకానితనం వల్ల, ఏడాది కాలంలోనే భూగర్భజలాలు పాతాళానికి పడిపోయి సమైక్యరాష్ట్రం నాటి దుస్థితి నెలకొంది.

రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ గా ఉంటూ ఉన్న వాస్తవాలు చెప్పాల్సింది పోయి.. వాటిని కప్పిపుచ్చి ఫిబ్రవరిలోనే ఎండలు ముదరడం వల్ల భూగర్భజలాలు పడిపోయాయనడం దారుణం. కళ్లముందు ఎండిపోతున్న పంటలను కాపాడుకోలేక రైతులు విలవిలలాడుతుంటే.. బోర్లు వేసి ఆర్థికంగా నష్టపోవద్దని ఉచిత సలహా ఇచ్చి చేతులు దులుపుకోవడం మరో విడ్డూరం.

అసలు ఈ దుస్థితి ఎందుకు వచ్చిందో, దీని నుంచి గట్టేందుకు ఏం చేయాలో ఆలోచించకుండా. పూర్తిగా చేతులెత్తేయడం అన్నదాతలను వంచించడమే. ఎండుతున్న పంటలను కాపాడాల్సిన ప్రభుత్వం తన బాధ్యతను మరిచి, మా వల్ల కాదని కాదు.. మీరే కాపాడుకోండని జారుకోవడం క్షమించరాని నేరం. మీ తప్పులను కప్పి పుచ్చుకునేందుకు కరువు కాటకాలు రావడం సహజం అన్నట్టుగా మాట్లాడి, కాంగ్రెస్ సృష్టించిన ఈ సాగునీటి సంక్షోభం నుంచి తప్పించుకోలేరు. ఇప్పటికే వ్యవసాయరంగం గురించి కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల, రాష్ట్రంలో 430 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కాంగ్రెస్ సర్కారు చేసిన మోసానికి రుణమాఫీ కాక, పెట్టుబడి సాయం రాక లక్షలాది మంది రైతులు అప్పులపాలై అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు పంటలకు సాగునీటి వసతి లేకపోవడంతో బోర్లు వేసినా చుక్కనీరు రాక మరింత ఆర్థికంగా చితికిపోతున్నారు.

ఈ విపత్కర పరిస్థితుల్లో తీవ్ర నిరాశా నిస్పృహల్లో ఉన్న రాష్ట్ర రైతాంగంలో భరోసా నింపాల్సిన పాలకులే అస్త్రసన్యాసం చేసిన సందర్భం దేశ చరిత్రలోనే లేదు. పదేళ్లపాటు సంతోషంగా సాగిన సాగును కన్నీటి సేద్యం చేసినందుకు రాష్ట్ర రైతాంగానికి ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి. రాజకీయ కక్షతో నిర్లక్ష్యం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మత్తులను వెంటనే పూర్తిచేసి రివర్స్ పంపింగ్ ద్వారా యుద్ధప్రాతిపదికన రిజర్వాయర్లు, చెరువులు, కాల్వలు నింపి ఎండిపోయే దశలో ఉన్న పంటలను కాపాడాలి. లేకపోతే రాష్ట్ర రైతులు కాంగ్రెస్ పార్టీని, ఈ ముఖ్యమంత్రిని ఎప్పటికీ క్షమించరు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 23, ఫిబ్రవరి 2025




ఈనెల 27వ తేదీన జరగనున్న మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కి మద్దతుగా సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశం లో రాష్ట్ర మంత్రులు దామోదర్




రాజనర్సింహ, కొండ సురేఖ లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో టి జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ అంజి రెడ్డిలు పాల్గొన్నారు.



## ఆలపాటి విజయాన్ని ఆకాంక్షిస్తూ సమావేశం

ప్రత్తిపాడు, మహానాడు: కృష్ణ – గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేస్తున్న కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని ఆకాంక్షిస్తూ ప్రతిపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల అధ్యక్షులు, పరిశీలకులు, ఐటిడిపి ముఖ్య నాయకులు సమావేశం శనివారం జరిగింది. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న డాక్టర్ లక్ష్మి

- కాలువలో కొట్టుకుపోయిన కుర్రాడి ఆచూకీకి గాలింపు చర్యలు

కురిచేడు, మహానాడు: దర్శి మండలం, వెంకటాచలం పల్లి పంచాయతీ పరిధిలోని నడింపల్లి గ్రామానికి చెందిన పుప్పాల వీరనారాయణ(17) శనివారం ప్రమాదవశాత్తు కురిచేడు రోడ్డులోని సాగర్ కెనాల్ వద్ద కాలువలో కొట్టుకుపోయాడు. అయితే, అదే సమయంలో దర్శి నుంచి కురిచేడు వెళ్తున్న టీడీపీ దర్శి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఈ సంఘటన తెలుసుకుని



ఆగారు. దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, ఎస్ఐ మురళీకి సమాచారం అందించారు. గజ ఈతగాళ్ళను పిలిపించాలని ఆదేశించి... వీలైనంత త్వరగా కుర్రాడి ఆచూకీ తెలపాలని ఆదేశించారు. ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

### వాగ్దేవి జూనియర్ కాలేజీ వార్షికోత్సవం

నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ కాలేజీ 13వ వార్షికోత్సవం శనివారం జరిగింది. దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా లక్ష్మిని కాలేజీ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు, రాయల కృష్ణారావు, సిబ్బంది ఉన్నారు.

## తగ్గిన సాగర్ నీటి నిల్వలు!

నాగార్జున సాగర్, మహానాడు: రిజర్వాయర్ లో నీటి నిల్వలు తగ్గిపోయాయి. దీంతో కుడి కాలువల పరిధిలో వారా బంది అమలు చేస్తున్నట్టు ఇరిగేషన్ అధికారులు శనివారం ప్రకటిం చారు. ఇందులో భాగంగా పక్షంలో తొమ్మిది రోజులు లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని కాలువలకు నీటి సరఫరా ఉంటుందని తెలిపారు. ఆరు రోజులు నీటి సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. ఆ వారా బంది అమలులో భాగంగా ఈ నెల 28 వ తేదీన లింగంగుంట్ల సర్కిల్



పరిధిలోని కాలువలకు నీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. ఈ దృష్ట్యా రైతులు నీటిని జాగ్రత్తగా అవసరం మేరకు వాడుకొని, నీటి వృథాను అరికట్టాలని కోరారు.

## రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికతో ముందుకు..

- గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మహానాడు: రాష్ట్ర భవిష్యత్తు గురించి పట్టభద్రులందరూ ఆలోచించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సత్యనారాయణపురంలోని సిద్ధార్థ కళాశాల, వార్డులోని పట్టభద్రుల ఇళ్లకు వెళుతూ ఎమ్మెల్యే రాము శనివారం ప్రచారం నిర్వహించారు. సిద్ధార్థ పాఠశాల ప్రిన్సిపల్ చోడవరపు విజయ్ కుమార్, కె.వి. కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ కొమ్ము వెంకటేశ్వర్లు, ఉపాధ్యా యులు,



పట్టభద్రుల్ని కలిసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించారన్నారు. ఓ వైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే.. మరో వైపు రాష్ట్రాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. ఈనెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు మద్దతుగా నిలవాలని పట్టభద్రులకు ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, వార్డు అధ్యక్షులు కృష్ణారావు, పలువురు టిడిపి నాయకులు రాము వెంట ప్రచారంలో పాల్గొన్నారు.



పెనుకొండ: బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి సవిత

# స్పెషల్ గ్రీవెన్స్‌లో పోటెత్తుతున్న అర్జీలు

- స్టేట్‌లోనే సర్వేపల్లి టాప్
- వైసీపీ ఐదేళ్ల పాలనలో సర్వేపల్లిలో లెక్కకు మించి అరాచకాలు
- ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కారానికి కృషి చేస్తున్నాం
- ముత్తుకూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

ముత్తుకూరు: మూడో సారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సర్వేపల్లి నియోజకవర్గంలో నాకు 2267 అర్జీలు వచ్చాయి. ప్రతి అర్జీని పీజీఆర్ఎస్‌లో రిజిస్టర్ చేస్తున్నాం...సమస్యల పరిష్కార ప్రక్రియను సీఎం కార్యాలయం పర్యవేక్షిస్తోంది. రాష్ట్రంలోనే అత్యధిక అర్జీలు, ఫిర్యాదులు సర్వేపల్లి నియోజకవర్గంలోనే వచ్చాయి. ఆ తర్వాతి స్థానంలో 1000 అర్జీలతో ఆత్మకూరు ఉంది.

ముత్తుకూరు ప్రత్యేక గ్రీవెన్స్ తర్వాత సర్వేపల్లి ఎమ్మెల్యే లాగిన్‌లో అర్జీల సంఖ్య 2500 దాటిపోతున్నాయి. కలెక్టర్‌తో పాటు అధికారులకు వచ్చిన అర్జీలతో కలుపుకుంటే సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి 5333 అర్జీలు వచ్చి ఉన్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో భూసర్వే ప్రక్రియలో తప్పులతడకలు, పీఓటీతో పేరుతో దోపిడీ, జగనన్న కాలనీ పేరుతో అక్రమాలు, ఫ్రీహోల్డ్ పేరుతో మోసాలు.. వీటన్నింటి ఫలితంగా అర్జీలు, ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా




వస్తున్నాయి.

ఐదేళ్ల వైసీపీ హయాంలో సర్వేపల్లి నియోజకవర్గంలో దుర్మార్గపు పాలన జరిగిందనేందుకు వేలాదిగా వస్తున్న ఈ అర్జీలే నిదర్శనం. ఇళ్ల స్థలాలు లేవని వందలాది అర్జీలు వస్తున్నాయి..అప్పటి ఎమ్మెల్యే కాకాణి ప్రజాసమస్యలను గాలికొదిలి దోపిడీకి పరిమితమయ్యాడు.

ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు మంజూరు చేయడంతో పాటు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేయబోతున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశాం. 150 గజాల(18 అంకణాలు) ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకున్న వారికి ఎలాంటి అభ్యంతరాలు లేకుండా జీఓ ఎంఎస్ 30 ప్రకారం తహసీల్దార్లే పట్టాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

150 గజాల నుంచి 300 గజాలు(36 అంకణాలు) అయితే పట్టా మంజూరు అధికారాన్ని ఆర్డీఓకు ఇచ్చారు. 300 నుంచి 500 గజాల స్థలం అయితే కలెక్టర్ పట్టా మంజూరు చేస్తారు. ముత్తుకూరు ప్రాంతంలో పారిశ్రామికీకరణ, జనాభా, కాలుష్యం పెరిగిన నేపథ్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. మత్స్య కళాశాలలో విద్యార్థులకు వసతుల కల్పనకు రూ.5.95 కోట్లతో ప్రతిపాదనలు పంపాం.

# రేవంత్ రెడ్డి అష్ట దరిద్రపు సీఎం

- మంచి సీఎం అంటే కేసీఆర్ ..దరిద్రపు సీఎం అంటే రేవంత్
- కొడంగల్‌లో ప్రజలు తన్ని తరిమితేనే రేవంత్ రెడ్డి మల్కాజ్ గిరి వెళ్ళారా ?
- నల్గొండ బాంబులు ,ఖమ్మం కత్తులు రేవంత్ మంత్రి వర్గం లోనే ఉన్నాయి
- నాలుగు వేల పెన్షన్ ఇచ్చిన గ్రామాలలోనే కాంగ్రెస్ పోటీ చేయాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, శుభప్రద్ పటేల్, పల్లె రవికుమార్, కిషోర్ గౌడ్

హైదరాబాద్: రేవంత్ రెడ్డి నిన్న మాట్లాడారు ,గతం లో కూడా మాట్లాడారు. కేసీఆర్ కరీంనగర్ నుంచి వచ్చి మహబూబ్ నగర్ లో పోటీ చేశారు అని రేవంత్ రెడ్డి అంటున్నారు. కేసీఆర్ కరీంనగర్ లో ఓడిపోతే మహబూబ్ నగర్ కి రాలేదు. రేవంత్ రెడ్డి కల్వకుర్తి నుంచి కొడంగల్ కు, కొడంగల్ నుంచి మల్కాజ్ గిరి వెళ్లలేదా ? కొడంగల్ లో ప్రజలు తన్ని తరిమితేనే రేవంత్ రెడ్డి మల్కాజ్ గిరి వెళ్ళారా ? మహబూబ్ నగర్ నుంచి వలసలకు కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణం.

రివర్స్ మైగ్రేషన్ కేసీఆర్ వల్లే సాధ్యమైంది. తెలంగాణ ఉద్యమం పై తుపాకీ ఎక్కుపెట్టిన రేవంత్ రెడ్డి యా నాటి ఉద్యమం గురించి మాట్లాడేది ? రేవంత్ రెడ్డి మాట ఎవరూ వినడం లేదు. తన కుర్చీ పై మంత్రులు కన్నేశారని రేవంత్ రెడ్డి అంటున్నారు. ఐ ఏ ఎస్ లు సరిగా పని చేయడం లేదని రేవంత్ రెడ్డే అంటున్నారు. రేవంత్ రెడ్డి లాంటి అష్ట దరిద్రపు సీఎం మరెవరూ లేరు. మంచి సీఎం అంటే కేసీఆర్ ..దరిద్రపు సీఎం అంటే రేవంత్. చర్చకు రమ్మని రేవంత్ సవాల్ విసురుతున్నారు.

చర్చలో ఓడిపోతే ముక్కు నేలకు రాస్తా అంటున్నారు. రేవంత్ రెడ్డి ముక్కు మూతి పాడవకుండా చూసుకుంటే మంచిది. చర్చలో ఓడి పోవడం ఖాయం .రేవంత్ ముక్కు ఊడటం ఖాయం. ఉద్యోగాల కల్పనపై రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఇందిరమ్మ ఇండ్లు కట్టిన చోట కాంగ్రెస్ పోటీ చేయాలి. డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టిన చోట బీ ఆర్ ఎస్ పోటీ చేయాలి అని రేవంత్ అంటున్నారు.

ఎన్నికలప్పుడు ఆసరా పెన్షన్లు నాలుగు వేల రూపాయలకు పెంచుతా అని రేవంత్ ఎన్నికలప్పుడు చెప్పారు. నాలుగు వేల పెన్షన్ ఇచ్చిన గ్రామాలలోనే కాంగ్రెస్ పోటీ చేయాలి. రైతు రుణమాఫీ వంద శాతం అయిన గ్రామాల్లోనే కాంగ్రెస్ పోటీ చేయాలి. రైతు భరోసా ఇచ్చిన గ్రామాల్లోనే కాంగ్రెస్ పోటీ చేయాలి. కల్యాణ లక్ష్మి వచ్చిన చోట బీ ఆర్ ఎస్ పోటీ చేస్తుంది .తులం బంగారం ఇచ్చిన చోట కాంగ్రెస్ పోటీ చేయాలి.

బీఆర్ఎస్ నేతలు కడుపులో కత్తులు పెట్టుకుని తిరుగుతున్నారని రేవంత్ అంటున్నారు. నల్గొండ బాంబులు ,ఖమ్మం కత్తులు రేవంత్ మంత్రి వర్గం లోనే ఉన్నాయి .ముందు వాళ్ళ నుంచి కాపాడుకో. పనిలో నిమగ్నం అయ్యానని రేవంత్ రెడ్డి చెప్పడం శుద్ధ అబద్ధం.




అవినీతి సంపాదన లో రేవంత్ నిమగ్నమయ్యారు.

కాంగ్రెస్ మళ్ళీ అధికారం లోకి రాదనీ తెలిసే రేవంత్ రాకరాక తనకు సీఎం గా అవకాశం వచ్చిందని అంటున్నారు. హామీల అమలుకు ఐదేండ్ల దాకా టైమ్ ఉందని రేవంత్ రెడ్డి అంటున్నారు. అలాంటపుడు వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఎందుకు అన్నారు ?ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.

### చరిత్ర రేవంత్ మారిస్తే మారదు: పల్లె రవికుమార్

పోతిరెడ్డి పాడు విషయం లో రేవంత్ రెడ్డి సీఎం పదవి లో ఉండి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారు. చరిత్ర రేవంత్ మారిస్తే మారదు. పోతిరెడ్డి పాడును వ్యతిరేకిస్తూ వై ఎస్ మంత్రి వర్గం నుంచి టీ ఆర్ ఎస్ బయటకు వస్తే కాంగ్రెస్ నేతలు పదవులు పట్టుకుని వేలాడారు.

రేవంత్ రెడ్డి తప్పుడు మాటలు మాని తెలంగాణ కు కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాకు ప్రయత్నించాలి. నల్లగొండ జిల్లా ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడేసిన ఘనత కాంగ్రెస్ దే. కేసీఆర్ ను విమర్శించే అర్హత రేవంత్ కు లేదు. బీసీ కుల గణన పై రేవంత్ రెడ్డి మొండి వాదనలు చేస్తున్నారు. కులగణన లోపాలపై శాస్త్రీయ ఆధారాలతో మేము మాట్లాడుతుంటే రేవంత్ జీర్ణించుకోలేక పోతున్నారు. ఏ రకంగా చూసినా రాష్ట్ర జనాభా 4 కోట్ల 30 లక్షలు దాటుతుంది. తక్కువ జనసంఖ్య చూపిన సర్వే తప్పు కాకుండా ఒప్పు అవుతుందా?

# గెలిచిన వెంటనే ప్రభుత్వంపై యుద్ధం

- నమ్మక ద్రోహానికి...పోరాటానికి మధ్య జరుగుతున్న ఎన్నికలివి.
- నాకు మంత్రి పదవి ముఖ్యం కాదు... ప్రజలే ముఖ్యం
- అందుకోసం ఎందాకైనా తెగిస్తా. రోడ్డెక్కి కొట్లాడేందుకు సిద్ధం
- బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బీసీకు ద్రోహం చేస్తున్న పార్టీ కాంగ్రెస్
- ఇప్పుడు బీసీ జపం చేస్తే నమ్మి మోసపోదామా?
- బీజేపీ అంటేనే బీసీల పార్టీ...
- నేను గెలిస్తే నా వేతనమంతా స్కూల్స్ అభివృద్ధికే ఇచ్చేస్తానని ప్రకటించిన అంజిరెడ్డి

కరీంనగర్: నమ్మక ద్రోహం నయవంచనకు – పోరాటాలకు, ధర్మ రక్షణకు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికలు జరగబోతున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. 6 గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన నయవంచన, నమ్మక ద్రోహానికి తగిన గుణపాఠం చెప్పాలని గ్రాడ్యుయేట్, టీచర్లకు పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు గెలిచిన వారం రోజుల్లోనే దీక్షలు, ఉద్యమాలతో కాంగ్రెస్ సర్కార్‌పై యుద్ధం ఆరంభిస్తామని ప్రకటించారు.

తనకు కేంద్ర మంత్రి పదవి ముఖ్యం కానేకాదని, ప్రజలే తనకు ముఖ్యమని చెప్పారు. మంత్రిగా ఉంటూ గ్రూప్ 1 అభ్యర్థుల పక్షాన హైదరాబాద్ లో ఉద్యమించిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బీసీలకు వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీ...ఇయాళ బీసీ జపం చేయడం సిగ్గు చేటన్నారు.

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పచ్చీస్ ప్రభారీల సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, గోపి, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, వాసాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు..

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు రావడం తథ్యం. ప్రజలు బీజేపీకి ఓటేయడానికి సిద్ధంగా ఉన్నారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ఓట్లు వేసేలా కష్టపడాలి. ఎందుకంటే ఓటు అడిగే అర్హత బీజేపీకి మాత్రమే ఉంది. బీజేపీ గెలుపును కూడా ఎవ్వరూ ఆపలేరు. అన్ని సర్వేల్లోనూ అంజి రెడ్డి ముందస్తులో ఉన్నారు. రెండో స్థానం కోసమే కాంగ్రెస్, ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

ఇప్పుడు బీసీ జపం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని చూస్తే నవ్వొస్తుంది.




భారతీయ జనతా పార్టీ అంటేనే బీసీల పార్టీ. ప్రధానమంత్రి బీసీ వ్యక్తి. తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీనే సీఎంను చేస్తామని గత ఎన్నికల్లో అధికారికంగా ప్రకటించినం. కానీ కాంగ్రెస్ లో సీఎం ఎవరు? బీసీ జాబితాలో ముస్లింలను కలిపి బీసీలకు అన్యాయం చేస్తోందెవరు? బీసీలకు అన్యాయం జరిగితే నోరు మెదపనోరు బీసీ బీసీ అని జపం చేస్తుంటే మోసపోదామా? ఇతరులు ఎవరు గెలిచినా ఎన్నికల తరువాత వాళ్లంతా కాంగ్రెస్ లో చేరతారు. నిఖార్సుగా నిజాయితీగా నిలబడి మీ పక్షాన పోరాడేది బీజేపీ మాత్రమేనని గుర్తుంచుకోవాలి.

బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే లేక పోటీ నుండి తప్పుకుంది. కాంగ్రెస్ కూడా అభ్యర్థులు దొరకక బయటి వాళ్లను అరువు తెచ్చుకుంది. మాజీమంత్రి జీవన్ రెడ్డి పోటీ చేయబోనని తప్పుకోవడమే ఆ పార్టీపట్ల వ్యతిరేకతకు నిదర్శనం. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ఓటుకు రూ.7 నుండి రూ.10 వేలు పంచుతున్నారు. అయినా బాధపడాల్సిన పనిలేదు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పైసలు పంచినా... 2 లక్షల 25 వేల ఓట్లకుపైగా మెజారిటీతో ప్రజలు నన్ను గెలిపించారు. మేధావులు డబ్బుకు అమ్ముడుపోయే వ్యక్తులు రారు. తగిన గుణపాఠం చెబుతారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించిన వారం రోజుల్లోనే ఉద్యోగ, ఉపాధ్యాయుల, నిరుద్యోగుల పక్షాన దీక్షలతో ఉద్యమాలు చేసి ప్రభుత్వ మెడలు వంచుతాం.... ప్రభుత్వంపై యుద్ధం చేస్తాం. ఒక్క ఎల్ఆర్ఎస్ దరఖాస్తుకు రూ.లక్ష నుండి 10 లక్షల దాకా వసూలు చేయబోతున్నరు. ప్రజా సమస్యలపై, 6 గ్యారంటీలపై బీజేపీ నిలదీస్తుంటే... కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎల్ఆర్ఎస్ పేరుతో వేల కోట్ల దోపిడీకి సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ కోసం 25 లక్షల 53 వేల 786 దరఖాస్తులు వస్తే.. ఒక్కో దరఖాస్తుకు తక్కువలో తక్కువ లక్ష రూపాయల నుండి 10 లక్షల రూపాయల దాకా వసూలు చేసి రూ.50 వేల కోట్ల జమ చేయాలని సిద్ధమైనరు.



ఖజానాలో పైసల్లేక...అప్పుల పుట్టక...గతిలేక...ఎల్ఆర్ఎస్ పేరుతో భారీ దోపిడీకి స్కెచ్ వేసింది.

ఇంతకుముందు ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చే ఆదాయమంతా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకే పోయేంది. ఏ వార్డులో ఎల్ఆర్ఎస్ ద్వారా ఎంత మొత్తం వస్తుందో అందులో 30 శాతం ఆ వార్డు అభివృద్ధికే ఖర్చు చేసేవాళ్లు. మిగిలిన 70 శాతం కూడా ఆ మున్సిపాలిటీ, కార్పొరేషన్ అభివృద్ధికే ఖర్చు చేసేవాళ్లు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిబంధనలను ఎత్తేసింది.

మొత్తం స్టేట్ ఖజానాకే జమ చేయాలని రూల్ తెచ్చి దోచుకునేందుకు సిద్ధమైంది. ప్రజల జేబులను గుల్ల చేసేందుకు సిద్ధమైంది. గత ఎన్నికల్లో ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని ప్రజలకు మాట ఇచ్చారు. ఒక్క పైసా కూడా కట్టొద్దని ఊరూరా తిరిగి ప్రచారం చేశారు... మాటకు కట్టుబడాల్సిందే. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాల్సిందే. నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన నిలదీస్తుందెవరు? మీ కోసం జైలుకు పోయిందెవరు? మీ కోసం లాఠీ దెబ్బలు తిన్నదెవరు? మీ కోసం రక్తం చిందించిందెవరు? పీఆర్సీ కోసం, డీఏల కోసం, బదిలీలు, ప్రమోషన్లు, గ్రూప్ 1 అభ్యర్థుల పక్షాన కొట్లాడి కాళ్లు చేతులు విరగ్గొందెవరు.... బీజేపీ కార్యకర్తలు కాకుండా ఇంకెవరైనా మీ పక్షాన పోరాటాలు చేశారా? నన్ను జైలుకు పంపేందుకు హిందీ పేపర్ లీక్ చేశారని అపవాదు వేసిన సంఘటనను మర్చిపోయారా?

కేంద్ర మంత్రిగా ఉంటూ గ్రూప్ 1 అభ్యర్థుల పక్షాన పోరాడిన. ఎందుకంటే నాకు మంత్రి పదవి ముఖ్యం కానేకాదు... నాకు ప్రజలే ముఖ్యం. వాళ్ల సమస్యల పరిష్కారమే ముఖ్యం. అందుకోసం ఎందాకైనా తెగిస్తా. రోడ్డెక్కి కొట్లాడేందుకు సిద్ధం... ఎమ్మెల్సీ ఎన్నికలు ఇజ్జత్ కా సవాల్. భారీ మెజారిటీతో గెలిచి తీరాలి. అందుకోసం కార్యకర్తలంతా సోషల్ మీడియాను విస్తృతంగా వాడుకోవాలని కోరుతున్నా.



స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధుడు, గొప్ప విద్యావేత్త మౌలాన అబుల్ కలాం ఆజాద్ "వర్ధంతి" సందర్భంగా, ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించిన సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ



పాడేరు నియోజకవర్గ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో పాడేరు మండలంలో ఉపాధ్యాయులను కలిసి రఘువర్మ ని అత్యధిక భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు .


జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

07

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 23, ఫిబ్రవరి 2025 ||



జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కుసుమ్ కుమార్, మాజీ మంత్రులు సుదర్శన్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, తదితరులు



మహానంది మండల తహసీల్దార్ కార్యాలయం నందు "ప్రజా దర్బార్" కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించిన శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి



## త్వరితగతిన కోటప్పకొండ పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే చదలవాడ ఆదేశం

నరసరావుపేట, మహానాడు: మండలం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా చేపడుతున్న పనులను శాసన సభ్యుడు చదలవాడ అరవింద బాబు కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం పరిశీలించారు. పనులు త్వరితగతిన ముగించాలని, తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది జరగకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

## ఖలీఫ్ తుల్లా భాషాకు బీజేపీకి సంబంధం లేదు!

- బీజేపీలో జనతా మజ్దూర్ సెల్ అనే అనుబంధ సంఘం లేదు
- పార్టీ మైనార్టీ మోర్చా వెల్లడి

అమరావతి, మహానాడు: ఒంగోలు ప్రాంతానికి చెందిన షేక్ ఖలిఫతుల్లా భాష అనే వ్యక్తి గతంలో భారతీయ జనతా పార్టీలో ఉన్నప్పటికీ ఆయన మీద ఉన్న అనేక ఫిర్యాదుల నేపథ్యంలో వారిని భారతీయ జనతా పార్టీ నుంచి పక్కన పెట్టామని, ఎటువంటి బాధ్యతలు కట్టబెట్ట లేదని ఆ పార్టీ మైనార్టీ మోర్చా



బాధ్యులు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అయితే, ఈ మధ్యకాలంలో ఆయన హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అని, ఏ9 యూట్యూబ్ ఛానల్ అని, బీఆర్ఎస్ పార్టీలో చేరటం, ఎన్ డి ఏ జేఏసీ ఏర్పాటు చేసి దాంతో ముస్లింల యూనిటీ అని, భారతీయ జనతా మజ్దూర్ సెల్ అని కొత్త ప్లాట్ఫామ్ తో సమాజంలో తిరుగుతున్నారని వారు తెలిపారు. ఇంకా, భారతీయ జనతా పార్టీకి అనుబంధం అని చెబుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీకు మద్దతు ఇస్తామని వీడియో చేయటం వంటి చర్యలకు పాల్పడుతున్నారని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశం మేరకు పార్టీకి ఆయన ఎటువుంటి సంబంధం లేదని ప్రకటిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

బీజేపీకి సంబంధం లేకపోయినా బీజేపీ పార్టీ చెబుతూ సమాజంలో తిరుగుతున్న ఇటువంటి వారిపై అప్రమత్తంగా ఉండాలని ఆ పార్టీ మైనార్టీ మోర్చా హెచ్చరించింది. ఖలీఫ్ తుల్లా భాషా వ్యవహారంపై రాష్ట్ర పార్టీ క్రమశిక్షణ సంఘాన్ని కూడా ఫిర్యాదు చేసినట్టు మైనార్టీ మోర్చా తెలిపింది. ఈ సమావేశంలో ఆ పార్టీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖుద్దుస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ భాష, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ షేక్ రఫీ, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ నాయకులు డి.హుస్సేన్, షేక్ కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.



విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులతో జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష.. హాజరైన సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతంపై కమిషన్ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రికి అందించిన చైర్మన్, సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు, చారగొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి, తదితరులు .







## ఇళ్ల స్థలాల పేరుతో వైసీపీ సర్పంచ్ భారీగా వసూళ్ళు!

- అతనిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- ఆట స్థలం కబ్జా చేసి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వైసీపీ లీడర్లు
- చర్యలు తీసుకోవాలంటూ స్కూల్ విద్యా కమిటీ సభ్యులు ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు మాజీ మంత్రి నెట్టెం రఘురాం, కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప

మంగళగిరి, మహానాడు: కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరుకు చెందిన ఎల్. జ్యోతీశ్వరి విజ్ఞప్తి చేస్తూ.. తన ఇంట్లో పనిచేస్తున్న రాజేష్ అనే వ్యక్తి తాను పనిమీద బయటకు వెళ్లడంతో ఇంట్లో ఉన్న బంగారం, వెండి, నగదు తీసుకెళ్లాడని గ్రీవెన్స్‌లో తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే... మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తమ్ముడి ఇంట్లో రాజేష్ అమ్మ పనిచేస్తుండటంతో తాము పెట్టిన కేసును పోలీసులు పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దొంగతనంపై విచారించి తమ ఇంట్లో పోయిన డబ్బులు బంగారాన్ని ఇప్పించవలసిందిగా ఆమె శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మాజీ మంత్రి నెట్టెం రఘురాం, కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్పలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

- విజయనగరం జిల్లా, గంట్యాల మండలం నరవ గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన వ్యక్తులు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేస్తూ.. వైసీపీ గ్రామ సర్పంచ్ గత ప్రభుత్వంలో పేదలకు ఇంటి స్థలాలు ఇప్పిస్తానని చెప్పి వారి నుండి సుమారు రూ. 12,00,000 లు వసూలు చేశాడని.. దీనిపై విచారించి పేదల డబ్బులు వారికి వెనక్కి ఇచ్చేలా చూడాలని అభ్యర్థించారు.
- ప్రకాశం జిల్లా, వెలిగండ్ల మండలం కోటాలపల్లి గ్రామంలో ప్రభుత్వ స్కూల్ ఆట స్థలాన్ని వైసీపీ పార్టీ లీడర్లు ఆక్రమించు కొని నిర్మాణాలు చేపడుతున్నారని.. దీనిపై కోర్టుకు వెళ్లగా కోర్టు ఆ నిర్మాణాలను నిలిపిందని.. ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన స్కూల్ విద్యా కమిటి సభ్యులు నేడు గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- కర్నూలు జిల్లా, ఆదోని పట్టణంలోని 21 వార్డు సచివాలయంలో కంప్యూర్లు పనిచేయకపోవడంతో ఏ పనిమీద వెళ్లినా సచివాలయ సిబ్బంది కంప్యూటర్ల సాకుతో ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని బోయ శకుంతల గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేసింది.
- అనంతపురం జిల్లా, రాప్తాడు మండలం జి. కొత్తపల్లి గ్రామానికి చెందిన చాకలి రామాంజనేయులు విజ్ఞప్తి చేస్తూ.. తమ చేత ఆస్తి రాయించుకొని తమ కొడుకులు తమను ఇంటి నుండి రోడ్డుపైకి గెంటారని.. దయ చేసి తాము తమ ఇంట్లో ఉండేలా అధికారులు సాయం చేయాలని వృద్ధ దంపతులు నేడు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ల మండలానికి చెందిన విజయలక్ష్మీ విజ్ఞప్తి చేస్తూ.. తమ పక్క వారు తమ భూమిని ఆక్రమించి ఇబ్బంది పెడుతున్నారని.. అధికారులు సర్వే చేసి తమ భూమి కబ్జా నుండి విడిపించాలని ఆమె విజ్ఞప్తి చేసింది.
- కర్నూలు జిల్లా, హాలహర్వి మండలం విరుపాపురం గ్రామానికి చెందిన విశ్వనాథ్ విజ్ఞప్తి చేస్తూ. తమ స్వాధీనంలో ఉన్న భూమిని గత ప్రభుత్వంలో ఎటువంటి హక్కులు లేని వారికి మ్యూటేషన్ చేసి ఆన్ లైన్ ఎక్కించారని.. దీనిపై అధికారులు విచారించి తమ భూమి తమకు దక్కేలా చూడాలని గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- పల్నాడు జిల్లా, అమరావతి మండలం మండేపూడి గ్రామానికి చెందిన కోట నాగభూషణం విజ్ఞప్తి చేస్తూ.. తన ఇంటిపై నుండి వెళ్తున్న సర్వీస్ విద్యుత్ వైర్లను తొలగించి పక్కకు మార్చాలని లేదంటే తమకు ఆ వైర్ల నుండి ప్రమాదం ఉందని విజ్ఞప్తి చేశాడు.

## తెలంగాణకి ఏం తెచ్చారో చెప్పిన తర్వాత బండి సంజయ్ ఓట్లు అడగాలి

- కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ,ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం ఇతర ముఖ్య నేతలతో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్: 27 వ తేదీన జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి ని గెలిపించాలి.. ఇక్కడ మెజారిటీ ఎక్కువ తేవాలని అందరం కలిసి మా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధానత్య ఓటు వేసి గెలిపించండి. పట్ట భద్రులు ఆలోచన చేయాలి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి.మేము 8 మంది ఎమ్మెల్యేలం జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు మా బాధ్యత గా తీసుకుపోతున్నాం. సిరిసిల్ల లో వాళ్ళు పెండింగ్ పెట్టిన బకాయిలు తీర్చడంతో పాటు అక్కడ వారికి ఉపాధి కల్పించాం. మహిళా సంఘాలకు ఇచ్చే చీరల ఆర్డర్ ఇచ్చాం. వారికి అండగా నిలబడ్డం.

మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్య రావణ కాష్టగా మారితే ఆ గ్రామ అల్లుడిని అని చెప్పుకునే ముఖ్యమంత్రి మీరు ఏం చేశారు? మా ప్రభుత్వం బాధితులకు 4600 ఇండ్లు సాంక్షన్ చేసింది. శాతవాహన యూనివర్సిటీ కాంగ్రెస్ ప్రభుత్వం లో ఏర్పడింది.. కాలేజి అభివృద్ధి అనేక రకాలుగా కృషి చేశాం.. యూనివర్సిటీ కి లా కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ రాబోతుంది

చొప్పదండి నియోజకవర్గంలో కొండగట్టు ఆలయం ,నారాయణ పూర్ రిజర్వాయర్ పూర్తి కాబోతుంది. హుస్నాబాద్‌లో గౌరవెల్లి గండి పల్లె ప్రాజెక్ట్ పూర్తి కాబోతుంది. జిల్లాకు సంబంధం లేని వ్యక్తులు మాట్లాడితే మేం చేస్తాం అంటే మాట్లాడే పరిస్థితి లేదు.ఉత్తర తెలంగాణలోని ప్రతి జిల్లాలో మేము 50 శాతం ఉన్నాం. మొదటి ఓటు తో గెలవాలనే ప్రయత్నం కొనసాగిస్తున్నాం. రేపు ఎల్లుండి క్షేత్ర స్థాయిలో ఓటరును కలవాలి. బండి సంజయ్ రెండు సార్లు ఎంపీ రెండు సార్లు కేంద్రంలో అధికారంలో ఉంది బండి సంజయ్ ఆరు ఏళ్లలో కరీంనగర్ పార్లమెంటుకి, తెలంగాణ కి ఏం తెచ్చారో తెచ్చిన తర్వాత ఓట్లు అడగాలి.నేను మాజీ పార్లమెంట్ సభ్యుడిగా ఏం




చేశానో చెప్పుకునే ధైర్యం ఉంది. పాస్ పోర్ట్ ఆఫీస్ ,తిరుపతి రైలు ,మోడల్ స్కూల్ ,కేంద్రీయ విద్యాలయాలు ఎన్నో చేశాం

రంజాన్ మాసంలో ఉద్యోగులకు కొంచెం ముందుగానే పంపిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో పొత్తులో ఉన్న మీరు మాకన్నా రెండు రోజులముందే జీవో ఇచ్చారు. ఇక్కడ మతరాజకీయాలు చేస్తున్నారు.

## జలాలపై రేవంత్ రెడ్డిది కపట నాటకం!

- బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి విమర్శ

కర్నూలు, మహానాడు: ఏపీ కృష్ణ జలాలను దోపిడీ చేస్తున్నారని టీ సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం దారుణం.. ఏపీ ప్రజలను, రైతులను దోపిడీ దొంగలుగా చెప్పడం దారుణం.. ఒక సీఎం మాట్లాడడం సహేతుకమైందా..? శ్రీశైలం డ్యామ్ నిర్మాణం ఎవరి త్యాగలతో నిర్మించారో, వారికి నీరు వినియోగించుకునే పరిస్థితుల్లో ఉన్నారా...రేవంత్ రెడ్డికి తెలియదా అని బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఇక్కడి మీడియాతో మాట్లాడారు. ప్రజలను మోసం చేసి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారు.. ఏపీ తన కాళ్ళ మీద నిలబడుతుంది, కేంద్రంతో సఖ్యతతో నిధులు తెచ్చుకున్నున్నారని ఆయన అన్నారు. ఇంకా, విష్ణువర్ధన్ ఏమన్నారంటే...

తెలంగాణలో ఒక్క స్కీం కూడా అమలు చేసే పరిస్థితి లేదు. ఏపీ, తెలంగాణ మధ్య కావాలనే జలవివాదాలు సృష్టిస్తున్నారు. రేవంత్ రెడ్డి కపట నాటకం ఆడుతున్నారు. రేవంత్ రెడ్డి బేషరతుగా ఏపీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దింపుతారని పత్రికల్లో కథనాలు వస్తున్నాయి...అందుకే రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడుతున్నారా...?

దేశంలో కాంగ్రెస్ పని అయిపోయింది. దేశంలో 22 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంటే కాంగ్రెస్ ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికారం కోల్పోతుంది. ఏపీ లో జగన్ క్యాబినెట్ ఒక్క మంత్రి తప్ప అందరూ ఓడిపోయారు. ఇపుడు వివిధ మంత్రిత్వ శాఖలను వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. వైసీపీ హయాంలో ఆయా మంత్రులు ఆయా శాఖలను మంచిగా చేసి ఉంటే మంత్రులు ఎందుకు ఓడిపోయారు. మంత్రి సత్యకుమార్, నారా లోకేష్ పై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. 8 నెలల్లో ఏదో అయిపోయినట్టు వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు.

ప్రతిపక్ష హోదా ఇస్తేనే మాట్లాడతా అని జగన్ అంటున్నారు. 2014-19 మధ్య 67 మంది ఎమ్మెల్యేలు ఉన్నపుడు జగన్ అసెంబ్లీ కి వెళ్ళారా...మధ్యలో వదిలేసి జగన్ పాదయాత్రకు వెళ్లారు. అధికారంలో ఉంటేనే సభకు వెళ్తా అనే పద్ధతిలో జగన్ వున్నారు. ఆ విషయం ప్రజలకు జగన్ చెప్పాలి. వైసీపీ నిర్మాణాత్మకమైన




ప్రతిపక్షపాత్ర పోషించాలి. 8 నెలల్లో విమర్శలు తప్ప ఒక్క మంచి విషయంలో అయినా కూటమి ప్రభుత్వానికి సహకరించారా? అధికార దాహంతో జగన్ మాట్లాడుతున్నారు.

ప్రజాసమస్యలు మాట్లాడలనుకుంటే వేదిక అసెంబ్లీ. అసెంబ్లీకి జగన్ వెళ్లకుండా మండలికి బొత్స వెళ్తారట..ఇది ద్వంద్వ ప్రమాణాలు కాదా...? ఎన్డీయే కూటమిలో ఐక్యతకు కొరత లేదు... ఆరోపణలు, ప్రచారాలు అవాస్తవం. మిర్చికి రైతులకు న్యాయం చేసే దశలో నిర్ణయం జరిగింది.

## పల్నాడు నరసరావుపేటలో వ్యాపారాలు వెల వెల

మధ్యాహ్నం వేళ దుకాణాలు లో ..బేరాల్లేవ్..

పల్నాడు జిల్లాలో జిల్లా ప్రధాన కేంద్రం నరసరావుపేట ప్రధాన కేంద్రంలో వ్యాపారాల్లేక ఇబ్బంది పడుతున్న వ్యాపారులు కొనుగోలు దారులు లేక దుకాణాలు వెల వెల.

రోజు రోజు కు తగ్గి పోతున్న వ్యాపారాలతో దిక్కు తోచని స్థితిలో కొట్టు మిట్టాడుతున్న వ్యాపారులు.

కూరగాయల మార్కెట్ రోడ్డు, మెయిన్ రోడ్డు, గాంధీ చౌక్, సత్తనపల్లిరోడ్డు, చిలకలూరిపేట రోడ్, కుమ్మరి బజార్, నంబూరు బజార్, గీతా మందిర్ రోడ్డు గడియార స్తంభం, పల్నాడు రోడ్ మరియు రైల్వే స్టేషన్ వరకు ఎక్కడా వ్యాపారాల్లేవ్...

ఖాళీగా కూర్చుని మొబైల్ లో సినిమాలు, సీరియల్స్. లేకపోతే నాలుగు షాపులు వాళ్ళు చేరి పోసుకోలు కబుర్లుతో టైం పాస్ చేస్తున్న వ్యాపారులు దిక్కుతోచని దుస్థితి. ఇకముందు ఏమిటని దిగాలు పడుతున్న పరిస్థితి.

అద్దెలేమో ఎక్కువ

వ్యాపారాలు మాత్రం తక్కువ తక్కువ.

"టూ – లెట్" బోర్డులతో కన్పిస్తున్న కొన్ని దుకాణాలు. ఖాళీ అయితే వేరే వారు తీసుకునే పరిస్థితి లేక..

కొద్దో గొప్పో మార్వాడిలు లేకపోతే ఊర్లో సగం షాపులు పైగా టూలేట్ బోర్డ్స్ కనబడేవి.

దుకాణాల అద్దెలు

పెట్టుబడి వ్యయం

వ్యాపారంలో పోటీ తత్వం

కార్పొరేట్ షాపింగ్ మాల్స్ భారీ గా పెరిగిన పర్యవసానం..

కనీసం విద్యుత్ చార్జీలు నిర్వహణ ఖర్చులకు తోడు, మెట్టు ఎక్కే వారు కాన రాక దీనంగా ఉన్న వ్యాపారుల దుస్థితి.

తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మెత్తం ఇదే పరిస్థితా? లేక నరసరావుపేట పట్టణం, పల్నాడు జిల్లాలో ప్రతి గ్రామం ప్రతి మండలంలో ఇదే పరిస్థితా?

ఒక వైపు వరుసగా వ్యాపారం లేక రియల్ ఎస్టేట్ ల వ్యాపారాలు లేక మరియు ఐపీ గోల.

అప్పు ఇచ్చే వారే లేరు.

చివరికి డైలీ చిట్ లు కూడా కట్టుకునే పరిస్తితి లేదు.



ఇదే పరిస్థితి మరో కొన్ని నెలల గడిస్తే షాపులు ఖాళీ చేసే వారే ఎక్కువ గా ఉండే అవకాశాలు లేక పోలేదు.

జిల్లాలో పేరుగాంచిన వ్యవసాయం విల విల. కొద్దో గొప్ప వర్షాలు పడి పంట బాగా ఉంది అంటే రేటు లేక రైతులు దిగాలు.

రైతులు విల విల.... షాపులలో వర్కర్స్ జీతాలు పెరిగి మెయింటెన్స్ పెరిగింది. తీరా చూస్తే వ్యాపారస్తులకు వ్యాపారాలు విలవిల.

పైవన్నీ ఒక ఎత్తు అయితే....

మేమున్నామంటూ ఆఫీసర్స్ మా టార్గెట్స్ తగ్గినవని షాపులపై రైడింగ్స్..మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు.

మిర్చి, సెనగ ధర కుదేలు, రైతులు లబోదిబోమంటున్నారు,

ఏ రాష్ట్రం లో నైనా వ్యాపారం బాగుంటేనే రైతుకు సరైన ధర లభిస్తుంది. రైతు బాగుంటేనే అన్ని వ్యవస్థలు బాగుంటాయి.

ఇంతకు పూర్వం వ్యాపారాలు కరోనా ముందు కరోనా తర్వాత అనే వారు. ఇప్పుడు ఎలక్షన్ బిఫోర్ ఎలక్షన్ ఆఫ్టర్ అని వ్యాపారస్తులు బాధతో అంటూ ఉన్నారు.

వ్యాపారస్తులను ముందుగా ప్రభుత్వం ఆదుకోవాలి.

వ్యాపారస్తులకు వ్యాపారాలు బాగా ఉండి ఉంటే దేశాభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధిలో టాక్స్ ల రూపంలో తమ వంతు పాత్ర ప్రధానమైనది.


వ్యాపారస్తులకు వ్యాపారాలు లేక టాక్స్ కట్టకపోతే, ప్రభుత్వాల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలి.

- కొత్తూరి కిషోర్ బాబు

చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఏపీ.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 23, ఫిబ్రవరి 2025 ||


## ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు జనసేన మద్దతు



**విజయవాడ:** ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు మద్దతు పలుకుతూ జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు నిర్ణయించారు. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం ఏ విధంగా జనసేన అండగా నిలుస్తుందో, అదే విధంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఒకే మాట మీద నిలవాలని సూచించారు.

ఈ మేరకు పార్టీ పి.ఏ.సి. ఛైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "సార్వత్రిక ఎన్నికల్లో పని చేసిన విధంగా కూటమి స్ఫూర్తిని ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ నిలపాలి. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియపై స్పష్టమైన అవగాహనతో ముందుకు వెళ్తూ మనం మద్దతు తెలియచేస్తున్న రఘు వర్మకు ప్రథమ ప్రాధాన్య ఓట్లు పోలయ్యేలా చూడాలి" అన్నారు. శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ సందేశాన్ని తెలియచేశారు.

## చెల్లని సీఎంఆర్ఎఫ్ చెక్కు

- చెల్లని సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యే.
- ఎమ్మెల్యే ఇచ్చిన చెక్కు చెల్లలేదు
- అంతకుముందే డ్రా చేసుకున్న మరొకరు
- రెండు సార్లు మార్చి ఇచ్చినా చెల్లని చెక్కు
- లబోదిబోమంటున్న బాధితులు

(బీవీవీ శ్రీనివాస్)

**చొప్పదండి:** కాంగ్రెస్ ఎమ్మెల్యే చేతుల మీదుగా తీసుకున్న సీఎంఆర్ఎఫ్ చెక్కు బ్యాంకులో డిపాజిట్ చేస్తే, ఈ పేరున ఇంతకుముందే మరొకరు నగదు తీసుకున్నారని సిబ్బంది చెప్పడంతో ఖంగుతినాల్సి వచ్చింది.

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకపల్లికి చెందిన పిట్టల లలిత.. రెండేళ్ల క్రితం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకొని, సీఎంఆర్ఎఫ్ పరిహారం కోసం దరఖాస్తు చేసుకుంది. గతేడాది చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా రూ.12 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందుకుంది. చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేయగా ఈ పేరు మీద ఇంతకముందే వేరే వాళ్ళు నగదు తీసుకున్నారని చెప్పడంతో, తిరిగి ఆ చెక్కును హైదారాబాద్ కు పంపించారు.

అయితే అధికారులు మళ్ళీ తిరిగి అదే చెక్కును పంపిం చడంతో, బ్యాంకు సిబ్బందికి చూపించిన లబ్దిదారు భర్తకు.. చెక్కు నెంబర్ మారలేదని, నెంబర్ మారితేనే డబ్బులు వస్తాయని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో నిరాశగా వెనుదిరిగాడు. ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు వెంటనే సీఎంఆర్ఎఫ్ పరిహారం ఇప్పించాలని బాధిత దంపతులు కోరుతున్నారు.



**ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అంటే ఇక అది బ్యాంకు ఖాతాలో పడినట్లే లెక్క. అది లబ్ధిదారులకు బరాబర్ వచ్చి తీరుతుంది. కానీ ఆ ఎమ్మెల్యే బాధితుడికి ఇచ్చిన సీఎంఆర్ఎఫ్ చెక్కును, అదే పేరుతో మరొకరు అంతకుముందే తీసేసుకున్న వైచిత్రి ఇది. పేరుకు చెక్కు ఇచ్చినట్లు ఇచ్చి, డబ్బులు మాత్రం మరొకరికి ఇవ్వడమేంటటన్న ఆ లబ్ధిదారుల అరిగోస ఇది.**



## సలీమాకు తగిన సాయం చేయండి

- కలెక్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**హైదరాబాద్:** కాలిన గాయాలతో లేవలేని స్థితిలో మంచానికే పరిమితమైన సలీమాను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తక్షణమే ఆమెకు తగిన వైద్య సహాయం అందించడంతో పాటు దివ్యాంగుల పింఛను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు కూడా ఇవ్వాలని సీఎం అధికారులకు సూచించారు. వంట చేసుకుని తినే పరిస్థితి లేకపోవడంతో ఆమెకు భోజనం సదుపాయం కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం గుండ్లసింగారం గ్రామానికి చెందిన సలీమా దీన స్థితి పైన ఓ పత్రికలో వచ్చిన కథనంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు సూర్యాపేట జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. కాలిన గాయాల కారణంగా సలీమా నరాలు దెబ్బతినడంతో ఆమె మంచానికే పరిమితమయ్యారు. దీంతో సలీమా పదేళ్ల కుమార్తె రిజ్వాన తల్లి కి సపర్యలు చేస్తోంది. ఒక వైపు తల్లి బాధ్యతలు చూసుకుంటూనే బడికి వెళ్లి చదువుకోవడం విశేషం.

## అపోలోలో వైద్య పరీక్షలు చేయించుకున్న పవన్

**హైదరాబాద్:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. స్కానింగ్, తత్సంబంధిత పరీక్షలు నిర్వహించారు. రిపోర్ట్స్ పరిశీలించిన వైద్యులు పలు సూచనలు చేశారు. మరికొన్ని వైద్య పరీక్షలు అవసరం ఉంది. ఈ నెలాఖరునగానీ, మార్చి



మొదటి వారంలోగానీ మిగిలిన వైద్య పరీక్షలు చేయించుకొంటారు. 24వ తేదీ నుంచి మొదలయ్యే బడ్జెట్ సమావేశాలకు పవన్ కల్యాణ్ హాజరవుతారు.

## పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు తధ్యం

- నిడదవోలు ఎన్నికల పరిశీలకులు వేదవ్యాస్ ధీమా

**నిడదవోలు:** ఈనెల 27వ తేదీన జరగనున్న శాసన మండలి ఎన్నికల్లో ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖర్ విజయం తథ్యం అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నిడదవోలు నియోజకవర్గం శాసనమండలి ఎన్నికల పరిశీలకులు



బూరగడ్డ వేద వ్యాస్ ధీమా వ్యక్తం చేసారు.

మంత్రి కందుల దుర్గేష్ తో కలిసి అయన ఉండ్రాజవరం ప్రాంతంలో పట్టభద్రులు అయిన ఓటర్లను కలుసుకొని పేరాబత్తుల విజయానికి సహకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాల వల్ల రాష్ట్ర అభివృద్ధి పరిగెడుతుందని వ్యాస్ అన్నారు.పర్యటించిన ప్రతి గ్రామంలోనూ ఓటర్లు వీరికి ఘన స్వాగతం పలికారు.అలాగే కూటమి నాయకులు వీరిని పలుచోట్ల ఘనంగా సత్కరించారు.

## అక్రమ గంజాయి ధ్వంసం

**గుంటూరు, మహానాడు:** పల్నాడు జిల్లా పరిధి యడ్లపాడు లోని జిందాల్ ఫ్యాక్టరీ వద్ద డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో 3737 కిలోల



అక్రమ గంజాయి, 4. 288 లీటర్ల లిక్విడ్ గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం కృష్ణా జిల్లాలో అయిదు సబ్ డివిజన్‌లలో దొరికిన గంజాయిని ఈగల్ ఐజిపి ఆకే రవికృష్ణ, సర్వశ్రేష్ఠ త్రిపాఠి, అశోక్ కుమార్ స్వయంగా ధ్వంసం చేయించారు.

## అన్నీ రేవంత్ చూస్తాడనుకోవద్దు

మొదటి పేజీ తరువాయి..

కూడా ఇలాంటి సాహసం చేయలేదు. కానీ తెలంగాణలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం అందరి భాగస్వామ్యంతో కులగణన నిర్వహించాం. సమగ్ర కుటుంబ సర్వే తప్పుల తడకగా ఉందనే.. ఆనాటి ప్రభుత్వం లెక్కలను బయటపెట్టలేదు. అందుకే ఆ వివరాలను ఎన్నికల కోసం వాడుకున్నారు తప్ప..ప్రజల కోసం వినియోగించలేదు. కానీ మేం చిత్తశుద్ధితో కులగణనపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశాం.

చట్టపరంగా ఇబ్బందులు కలగకుండా ప్లానింగ్ డిపార్ట్ మెంట్ కు అప్పగించి కులగణను పకడ్బందీగా నిర్వహించాం. ఇంటింటికి ఎన్యుమరేటర్లను పంపి సమాచారాన్ని సేకరించాం. సేకరించిన సమాచారాన్ని తప్పులు దొర్లకుండా ఎన్యూమరేటర్ సమక్షంలో కంప్యూటరీకరించాం. తప్పులు జరిగాయని మాట్లాడుతున్న వారు ఏ బ్లాక్ లో ఎక్కడ తప్పు జరిగిందో చెప్పాలి. ప్రక్రియను తప్పుబట్టడం ద్వారా మొత్తం వ్యవస్థను కుప్పకూల్చేందుకు కుట్రలు చేస్తున్నారు ఇది బీసీ సోదరులు గమనించాలి.

స్వతంత్ర భారత దేశంలో ఎవ్వరూ ఇప్పటివరకు కులగణన చేపట్టలేదు. ఒక్కసారి బీసీల లెక్క తెలిస్తే వాటా అడుగుతారనే దీనిపై కొందరు కుట్ర చేస్తున్నారు. ఎంతోకాలంగా ఉన్న డిమాండ్ ను మనం విజయవంతంగా ముందుకు తీసుకెళుతున్నాం. బీజేపీలో ఉన్న ఒకటి రెండు ఆధిపత్య సామాజిక వర్గాలకు, నష్టం జరుగుతుందనే వాళ్లు కులగణనపై కుట్రలు చేస్తున్నారు. దేశంలో కులగణన చేపట్టడం ఇష్టంలేకనే బీజేపీ కులగణనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

కేసీఆర్ సర్వే ప్రకారం బీసీలు 51 శాతం మాత్రమే%ా% కానీ మన కులగణన ప్రకారం 56.33 శాతం. ఇక బీసీల లెక్క తగ్గిందో పెరిగిందో మీరే చెప్పండి. గుజరాత్ లో ముస్లింలు ఓబీసీ కేటగిరీలో ప్రయోజనం పొందుతున్నారని%ా% తాను ఎప్పుడూ మీడియాలో చెప్పుకోలేదని మోదీ 2023 లో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. కానీ బండి సంజయ్ రేవంత్ రెడ్డి బీసీలలో ముస్లింలను కలిపారని చెబుతున్నాడు. తప్పుడు మాటలు మాట్లాడటం కాదు.. ఏ బ్లాక్ లో ఏ ఇంట్లో తప్పు జరిగిందో నిరూపించాలని కెసిఆర్, బండి సంజయ్, కిషన్ రెడ్డికి సవాల్ విసురుతున్నా.

భవిష్యత్‌లో దేశంలో బీసీ రిజర్వేషన్ల గురించి చర్చించాలంటే తెలంగాణ గురించి, రేవంత్ రెడ్డి గురించి చర్చించుకునే పరిస్థితి ఉంటుంది. ఈ అవకాశాన్ని జారవిడిచుకుంటే చరిత్ర మిమ్మల్ని క్షమించదు. నేను రాజకీయ అజ్ఞానంతో మాట్లాడటంలేదు. మా నాయకుడి ఆదేశాలు పాటించే వ్యక్తిగా మాట్లాడుతున్న. నాయకుడి ఆదేశాలను పాటించడమే నా ధర్మం. ఈరోజు మనం చేసిన లెక్క నూటికి నూరు శాతం పక్కా. ఎవరు ఏం చెప్పినా నమ్మొద్దు. మోదీ రాజకీయంగా వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందనే ఈ ప్రక్రియను తప్పుబడుతున్నారు.

బీసీల లెక్క తేలితే బీజేపీలో అధికారం చెలాయించే ఒకటి రెండు సామాజిక వర్గాలకు ఇబ్బంది అవుతుంది. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఇప్పటి వరకు వారి వివరాలు ఎందుకు నమోదు చేసుకోలే దు. 50శాతం ఉన్న ప్రజలు, అర శాతం ఉన్న వాళ్లను ప్రశ్నిస్తారని వాళ్లకు భయపట్టుకుంది. అందుకే బీసీల సర్వేకు వారు సహకరించడం లేదు.

కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఉద్యోగాలు పోతాయనే దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దీన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మీ అందరిపై ఉంది. పకడ్బందీ ప్రక్రియతో కులగణన చేశాం%ా%దీన్ని కాపాడుకుని ప్రజల్లోకి తీసుకెళ్లండి.అన్నీ రేవంత్‌రెడ్డి చూసుకుంటాడులే అనుకోవద్దు. ప్రక్రియ పూర్తి చేయడంతో నా బాధ్యత పూర్తయింది. దీన్ని పట్టాలెక్కించి గమ్యం చేర్చే వరకు ముందుకు తీసుకెళ్లే బాధ్యత మీదే. బీజేపీకి నేను సవాల్ విసురుతున్నా. మీరు జనగణనలో కులగణన చేర్చండి. ఎవరి లెక్క తప్పో తేలుతుంది. జనగణనలో కులగణన చేర్చాలని ఈ సమావేశం వేదికగా తీర్మానం చేస్తున్నాం.

సామాజిక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి మార్చి 10 లోగా తీర్మానాలు చేయండి. మీ ఐకమత్యాన్ని చాటండి. అప్పుడే మీకు రాజకీయంగా, విద్య ఉద్యోగాల పరంగా ప్రయోజనం ఉంటుంది. బలహీన వర్గాలకు కులగణన నివేదికనే బైబిల్, ఇదే భగవద్గీత, ఇదే ఖురాన్.

